మానేరు **జనత**®

తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

13.5.2026 బుధవారం Wednesday | సంపుటి (Volume): 11 సంచిక (Issue) : 17 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar


## గుజరాత్ సంచలన విజయం



సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..
శ్రేయోభిలాషులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

# అసోం సీఎంగా హిమంత బిశ్వ శర్మ

### ప్రమాణ కార్యక్రమానికి ప్రధాని హాజరు

### ఎన్డీ ముఖ్యమంత్రుల్లో చంద్రబాబు రాక



అస్సాం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వశర్మ ప్రమాణస్వీకారం చేశారు.అస్సాంలో వరుసగా రెండోసారి సీఎం పదవిని చేపట్టిన తొలి భాజపా నేతగా హిమంత నిలిచారు. ఆయనతో పాటు మరో నలుగురు మంత్రులు ప్రమాణం చేశారు. ఉదయం 11.40 గంటలకు గువాహటిలోని వెటర్నరీ కాలేజీ ఫీల్డ్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. బిశ్వ శర్మతో పాటు బీజేపీ నుంచి ఇద్దరు, ఏజీపీ, బీపీఎఫ్ నుంచి ఒక్కొక్కరు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు.



**తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌గా జేసీడీ ప్రభాకర్**

**డిప్యూటీ స్పీకర్‌గా రవిశంకర్ ఎన్నిక**



# జలసాధన ఉద్యమం మళ్లీ రావాలి

### మనమే రంగంలోకి దిగుదాం...

### ప్రజల్లోకి పోదాం పార్టీని బలోపేతం చేద్దాం

### ఎర్రవెల్లి ఫాంహౌస్లో బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శుల సమావేశంలో గులాబీ దళపతి కేసీఆర్ దిశానిర్దేశం

**బీఆర్ఎస్ ముఖ్య నేతలతో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భేటీ దాదాపు ఆరు గంటలుగా కొనసాగింది. ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్ వివిధ అంశాలపై పార్టీ నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ నమోదు పక్రియ, పార్టీ ఇన్‌ఛార్జ్‌ల నియామకం సహా పార్టీ బలోపేతం వంటి ముఖ్యమైన విషయాలపై కేసీఆర్ అధ్యక్షతన చర్చ జరిగినట్లు సమాచారం.**



**జనతా న్యూస్, గజ్వేల్ :** తెలంగాణ సాగునీటికి జరుగుతున్న అన్యాయంపై మరో జల సాధన ఉద్యమమే శరణ్యమని, సర్ అమలు నేపథ్యంలో పార్టీ సభ్యత్వం కూడా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని డిజిటలైజేషన్ పద్ధతిలో సభ్యత్వ నమోదు జరపాలని బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ రాష్ట్ర కార్యవర్గానికి దిశా నిర్దేశం చేశారు. ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరాచకాలపై మరో పోరుకు సిద్ధమవుదామని పిలుపు నిచ్చారు. మంగళవారం ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ ప్రధానకార్యదర్శుల సమావేశం ఆరు గంటలకుపైగా సుధీర్ఘంగా జరిగింది. ఈ సమావేశంలో కేసీఆర్ మాట్లాడుతూ

మిగతా 2 లో

# నీట్ ప్రవేశ పరీక్ష రద్దు

### పేపర్ లీక్ వ్యవహారంతో ఎన్‌టీఏ నిర్ణయం

### సీబీఐ విచారణకు ఆదేశించినట్లు వెల్లడి

జాతీయ అర్హత పరీక్ష నీట్ యూజీ-2026ను రద్దు చేసారు. పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. నీట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం రాజస్థాన్‌లో లీకైనట్లు వచ్చిన వార్తలు పెనుదుమారం రేపాయి. ఈ నేపథ్యంలో జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా మే 3న జరిగిన నీట్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. త్వరలోనే కొత్త పరీక్ష తేదీలను వెల్లడిస్తామని తెలిపింది.

5





**లక్షల మంది విద్యార్థుల కలలు కల్లలు**

**నీట్ పరీక్ష రద్దుపై మండిపడ్డ రాహుల్**



## బండి భగీరథకు పోలీసుల నోటీస్

### నేటి మధ్యాహ్నం రెండింటికి హాజరు కావాలని పేట్ బషీరాబాద్ పోలీసుల ఆదేశం

### హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్

## చట్టానికి నా కొడుకు అతీతుడేమీ కాదు

**కేంద్రమంత్రి బండి సంజయ్**

.. వివరాలు 3లో

# ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం సహించం



### సజావుగా వరి, మొక్కజొన్న కొనుగోళ్లు

### ధాన్యం వెంటనే లారీల్లో తరలించాల్సిందే

### అవసరమైతే పోలీస్ సాయంతో ధాన్యం సేకరణ

### లారీలు పంపకుంటే క్రిమినల్ కేసులు పెట్టండి

### కలెక్టర్లకు సిఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు

ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఉపేక్షించొద్దని.. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకు వెనకాడవద్దని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండోవిడుత పంపిణీ

**రెండోవిడతపై 21న కేబినేట్‌లో ఖరారు చేస్తాం**

### స్పెషల్ డ్రైవ్ ద్వారా డబుల్ ఇళ్లు పంపిణీ

### అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి



# ఆనాటి జైళ్లు దుర్భరంగా ఉండేవి

### బ్రిటిష్ హయాంలో నరక కూపాలుగా జైళ్లు

### తానూ ఎమర్జెన్సీలో జైలుకు వెళ్లి వచ్చా

### చంచల్‌గూడాలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభంలో గవర్నర్

02



మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
బుధవారం 13 మే 2026




# ఆనాటి జైళ్లు దుర్భరంగా ఉండేవి

## చంచల్‌గూడాలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభంలో గవర్నర్

**హైదరాబాద్,మే12:** స్వాతంత్ర్యానికి ముందు జైళ్లు ఎంత అమానవీయంగా ఉండేవో ప్రజలకు తెలియజేయాల్సి ఉందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తెలిపారు. మంగళవారం చంచల్‌గూడ జైలులో ఏర్పాటు చేసిన మ్యూజియం, ఫీల్ ది జైల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. స్వాతంత్రానికి పూర్వం జైల్లో గడిపిన వారు ఎలా ఉండేవారనే విషయం ఈ మ్యూజియంను చూస్తే తెలుస్తుందన్నారు. తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభించడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ మ్యూజియంలో ఉన్నది కేవలం ఇతిహాసానికి సంబంధించిన వస్తువులు కాదన్నారు. స్వాతంత్రానికి ముందు జైళ్లలో ఉన్నవారు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారో ఈ మ్యూజియం ద్వారా తెలుస్తుందని చెప్పారు. శిక్షల పేరుతో సంస్కారాన్ని, శరీరాన్ని, మనస్తత్వాన్ని విరగ్గొట్టే ప్రయత్నం చేశారని బ్రిటిష్ పాలనలో సాగిన అకృత్యాలను ఆయన వివరించారు.

మన కోసం మన పూర్వీకులు పడ్డ కష్టాన్ని తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరు ప్రయత్నం చేయాలని ప్రజలకు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. విద్యార్థి నాయకుడిగా ఉన్న సమయంలో తాను పలుమార్లు జైలుకు వెళ్లానన్నారు. ఎమర్జె÷న్సీ సమయంలో 21 రోజులు తాను జైల్లో ఉన్నానని ఆయన గుర్తు చేసుకున్నారు. అప్పుడే జైలు ఎలా ఉంటుందో తనకు తెలిసిందని వివరించారు. గతంలో ఉత్తరప్రదేశ్‌లో కళ్యాణ్ సింగ్ ప్రభుత్వంలో జైళ్ల శాఖ మంత్రిగా తాను పని చేశానని తెలంగాణ గవర్నర్ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జైళ్లలో తాను పలు సంస్కరణలు తీసుకొచ్చానని తెలిపారు. ఈ సంస్కరణలతో ఖైదీలు సంతోషం వ్యక్తం చేశారని చెప్పారు. ఈ రోజు మ్యూజియంలో చూసిన దృశ్యాలతో.. మళ్లీ ఆనాటి జ్ఞాపకాలు తనకు గుర్తుకు వచ్చాయన్నారు. ఖైదీలలో ప్రతి ఒక్కరూ క్రిమినల్స్ కాదని.. పరిస్థితులు వారిని ఆ సమయంలో నిందితులుగా మార్చాయని వివరించారు. ఖైదీలలో మార్పు తీసుకురావడానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జైలు అధికారులకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. మరోసారి తప్పుచేసే ఆలోచన రాకుండా ఖైదీల్లో పరివర్తన తీసుకురావాలని అధికారులకు స్పష్టం చేశారు. సాధారణ ప్రజల కోసం చంచల్‌గూడ జైలు అధికారులు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. జైలు ఆవరణలో 'జైల్ మ్యూజియం', 'ఫీల్ ది జైల్' పేరుతో ప్రత్యేక బ్లాక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ప్రారంభించారు. ఇప్పటికే గోవా, కోల్‌కతా వంటి ప్రాంతాల్లో జైలు మ్యూజియాలు ఉన్నాయి. తాజాగా హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు కూడా ఈ జాబితాలో చేరింది. జైల్ మ్యూజియంలో జైలు చరిత్ర, ఉపయోగించిన పాత వస్తువులు, ఖైదీల జీవితం, శిక్షల విధానాలు వంటి అంశాలను ప్రదర్శించనున్నారు. ఇది విద్యార్థులు, పర్యాటకులు, సాధారణ ప్రజలకు జైలు వ్యవస్థ గురించి అవగాహన కల్పించడానికి ఉపయోగపడనుంది. 'ఫీల్ ది జైల్' బ్యారక్ ద్వారా సాధారణ ప్రజలు ఒకరోజు జైలు జీవితాన్ని అనుభవించేలా జైలు అధికారులు అవకాశం కల్పించారు. ఫీజు చెల్లించి రిజర్వేషన్ చేసుకున్నవారు జైలు రూల్స్ ప్రకారం ఒక రోజు బ్యారక్‌లో ఉండి, జైలు ఆహారం, రొటీన్ కార్యకలాపాలు, శిక్షల వాతావరణాన్ని అనుభవించవచ్చు. ఇది జైలు జీవితం ఎంత కష్టమో అర్థం చేసుకోవడానికి సహాయపడుతుందని అధికారులు తెలిపారు.

# బండి భగీరథకు పోలీసుల నోటీస్

## నేటి మధ్యాహ్నం రెండింటికి హాజరు కావాలని పేట్ బషీరాబాద్ పోలీసుల ఆదేశం

## హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్

**హైదరాబాద్ :** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్కు పేట్బషీరాబాద్ పోలీసులు నోటీ సులు ఇచ్చారు. పోక్సో కేసులో బుధవారం మధ్యాహ్నా 2 గంటలకు పోలీస్ స్టేషన్ లో విచారణకు హాజరుకావాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో

ళి4:30 ఖఎ, 13/5/2026రి ఎఱఅఅబ: కరీంనగర్ లోని భగీరథ్ ఇంటికి పోలీసు లు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపో వడంతో... భగీరథ్ మేనమామ వంశీకృష్ణ కు పోలీసులు నోటీసులు అందజేశారు. తన కుమార్తెను భగీరథ్ వేధిస్తున్నారంటూ ఓ బాలిక (17) తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్బషీరాబాద్ పోలీసులు భగీరథ్పై సెక్షన్ 11 రెడ్విత్ 12 ఆఫ్ పోక్సో యాక్ట్, బీఎన్ఎస్ 74, 75 సెక్షన్ల కింద శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. బాధితురాలి వాంగ్మూలాన్ని రికార్డ్ చేసిన పోలీసులు కేసులోని సెక్షన్ లను 5(1) రెడ్ విత్ 6 ఆఫ్ పోక్సో 2012 ప్రకారం మార్పులు చేశారు.

# చట్టానికి నా కొడుకు అతీతుడేమీ కాదు

## కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టీకరణ

**కరీంనగర్,మే12:** తన కుమారుడు బండి భగీరథ్‌ను నేరస్థుడిగా చూపే ప్రయత్నం చేస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆవేదన చెందారు. తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని చెప్పారు. బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైన నేపథ్యంలో సంజయ్ స్పందించారు. ఏ తప్పూ చేయలేదని నా కుమారుడు చెబుతున్నాడు. అతడిని నేను సమర్థించడం లేదు. చట్టాన్ని, న్యాయాన్ని గౌరవిస్తా. కోర్టు నిర్ణయాన్ని శిరసావహిస్తాం. చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చు. నా కుమారుడిపై దాడిని చూసి కన్నపేగు తల్లడిల్లుతోంది.. డిప్రెషన్‌లోకి పోతోంది. నేను బాధపడుతున్నానని ప్రత్యర్థులు అనుకుంటున్నారు. నేనెప్పుడూ బాధపడను. కుట్రలు, కుతంత్రాలు చేసిన వారితో పాటు నా కుటుంబం, నా పార్టీని ఇబ్బంది పెట్టిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టను అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. చట్టం అందరికీ ఒక్కటేనని, తన కొడుకైనా మరెవరైనా తప్పు చేస్తే శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు.

# నగరంలో చైన్ స్నాచింగ్‌లు

## ఆందోళనలో స్థానిక ప్రజలు

**వరంగల్,మే12:** జిల్లాలో చైన్ స్నాచర్లు, పోకిరీల రెచ్చిపోతున్నారు. సోమవారం రాత్రి మూడు చోట్ల చైన్ స్నాచింగ్ సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఒక వ్యక్తితో సహా ఇద్దరు మహిళల మెడలో బంగారు గొలుసులను దొంగలు తెంచుకెళ్లారు. ఈ సంఘటనలు స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి. వరంగల్ మిల్స్ కాలనీలో పోకిరీలు హంగామా సృష్టించారు. రాత్రి సమయంలో కొందరు యువకులు బైక్‌లపై తిరుగుతూ ప్రజలను భయపెడుతున్నట్లు తెలుస్తోంది. కాలనీలోని ఓ టీ స్టాల్ యజమానిపై పోకిరీలు దాడి చేశారు. దాడిలో టీ స్టాల్ యజమాని తీవ్రంగా గాయపడ్డాడని, అతన్ని స్థానికులు ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. నగరంలో పోలీసు పెట్రోలింగ్ పూర్తిగా కనిపించడం లేదని ప్రజలు తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు. రాత్రి సమయంలో మహిళలు, వృద్ధులు ఒంటరిగా బయటకు రావడానికి భయపడుతున్న పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురంలో దొంగలు బీభత్సం సృష్టించారు. రాత్రి ఓ ఇంటి తాళాలు పగలగొట్టిన దుండగులు భారీగా బంగారు నగలు, వెండిని అపహరించారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# జలసాధన ఉద్యమం మళ్లీ రావాలి



మొదటి పేజీ తరువాయి

ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత తీవ్రమవుతున్నది, ఈ తరుణంలో ప్రజల్లోకి వెళ్లి వారికి అండగా నిలవాల్సిన అవసరం నేతలపై ఉన్నది అని చెప్పారు. హిల్ట్ పాలసీతోపాటు ప్రజా ఆస్తులను కొల్లగొడుతున్న ప్రభుత్వ తీరును నిరసించి, హైడ్రా, మూసీ పేరుతో చేస్తున్న అక్రమాలను ఎక్కడికక్కడ నిలదీయాలని కోరారు. పెద్దల పక్షం వహిస్తూ పేదల ఇండ్లను కూలుస్తున్న సర్కార్ రెండున్నరేళ్లలో చేసిన అక్రమాలపై పోరు తీవ్రం చేయడంతోపాటు, రైతులను నిలువునా మోసం చేసిన రేవంత్రెడ్డి ప్రభుత్వం రై వ్యతిరేక విధానాలను పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసికెళ్లాలని ఆదేశించారు. కేసీఆర్ జై వస్తేనే రైతు భరోసా వేస్తున్నారని, ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం పేద రైతుల పా శాపంగా మారిందని ధ్వజమెత్తారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల సీ కేటాయింపులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనైతిక మైత్రితోపాటు, వ్యవసాయ వ్యతిరే రైతు వ్యతిరేక విధానాలపై నిలదీయాలని కోరారు. సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర చేస్తూ బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులను నింపకుండా చేస్తున్న తీరు ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేలా శ్రమించాలని, ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ప్రజల్లోకి వెళ్లి తమవైపు తిప్పుకోవాలని నేతల హితబోధ చేశారు. మంగళవారం ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో సుదీర్ఘంగా జరిగిన సమావేశంలో వాడివేడి చర్చ జరిగింది. పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అన్నీ తానై గులాబీ బాస్ కేసీఆర్ నేతలను కార్యోన్ముఖులను చేశారు. ప్రజా పక్షం వహిస్తూ వచ్చే ఎన్నికలే లక్ష్యంగా అధినేత కేసీఆర్ తన వ్యూహాలకు పదును పెట్టారు. ఈ భేటీలో పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ నమోదు, క్షేత్రస్థాయి పోరాటాలపై కేసీఆర్ సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. గులాబీ పార్టీ బీఆర్ఎస్ గా రూపాంతరం చెందిన తర్వాత తొలిసారిగా సభ్యత్వ నమోదు ప్రక్రియను చేపట్టాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. అయితే గతంలో లాగా కేవలం సంఖ్య కోసమే సభ్యత్వాలు కాకుండా, పార్టీ కోసం క్షేత్రస్థాయిలో



నిలబడే వారికే ప్రాధాన్యత ఇవ్వాలని కేసీఆర్ స్పష్టం చేశారు. ఒకప్పుడు 60 లక్షల మంది సభ్యులు ఉన్నప్పటికీ, ప్రస్తుతం పార్టీ ప్రతిపక్షంలో ఉన్నందున కేవలం క్రియాశీలకంగా ఉండేవారిని మాత్రమే గుర్తించాలని నేతలకు సూచించారు. కష్టకాలంలో పార్టీ జెండా మోసే కార్యకర్తలే అసలైన బలమని, వారందరికీ క్రియాశీలక సభ్యత్వం ఇవ్వడం ద్వారా పార్టీని బలోపేతం చేయాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు.

పార్టీ యంత్రాంగంలో భారీ మార్పులకు కేసీఆర్ శ్రీకారం చుట్టారు నియోజకవర్గాల్లో సభ్యత్వ నమోదును పర్యవేక్షించేందుకు పాత ఇంచార్జీలు లేదా మాజీ ఎమ్మెల్యేలపై ఆధారపడకూడదని ఆయన నిర్ణయించారు. దీనికి భిన్నంగా రాష్ట్ర పార్టీ కార్యాలయం నుండి నేరుగా కొత్త ఇంచార్జీలను నియోజకవర్గాలకు పంపాలని నిర్ణయించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిష్పాక్షికంగా అంచనా వేయడానికి, గ్రూపు రాజకీయాలకు తావులేకుండా పార్టీని ప్రక్షాళన చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పార్టీని మళ్లీ అధికార దిశగా నడిపించేందుకు కొత్త రక్తాన్ని నింపే ప్రక్రియలో భాగంగానే ఈ కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి.

### బీఆర్ఎస్ శ్రేణులను ఉత్తేజపర్చేలా...

రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్న తరుణంలో, బీఆర్ఎస్ శ్రేణులను ఉత్తేజితం చేసేందుకు కేసీఆర్ ఈ సమావేశాన్ని వేదికగా చేసుకున్నారు. పార్టీ నాయకత్వం నుంచి కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ ప్రజల్లో ఉండి పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. కోర్ కమిటీ సభ్యులైన కేటీఆర్, అసెంబ్లీ, మండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు, ప్రధాన కార్యదర్శులతో చర్చించిన కేసీఆర్, త్వరలోనే జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహించి పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపనున్నారు. మొత్తం మీద, ఎర్రవల్లి వేదికగా జరిగిన ఈ సమావేశం బీఆర్ఎస్ పార్టీలో కొత్త అధ్యాయానికి నాంది పలికినట్లయింది.

### సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు...

ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐ) చేపట్టిన సర్ ప్రక్రియతో పాటు, వోటర్ లిస్టు సవరణ తదితర కార్యాచరణ మొత్తం డిజిటల్ ప్రక్రియలో జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ సభ్యత్వం కూడా భవిష్యత్తును దృష్టిలో వుంచుకుని డిజిటలైజేషన్ పద్దతిలో జరపాలని, బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శుల సమావేశం అభిప్రాయ పడింది. ప్రతి నియోజకవర్గానికి, రాష్ట్ర కమిటీ నుండి సభ్యత్వ సమన్వయ కర్తను నియమించాలని నిర్ణయించారు. డిజిటలైజేషన్ పద్ధతిలో సభ్యత్వ నమోదు చేయాలని భావించినందున, రాష్ట్రంలో వున్న 35,655 పోలింగ్ బూత్ లలో., బూత్కు ఇద్దరు కార్యకర్తల చొప్పున మొత్తం 71,310 మంది పార్టీ కార్యకర్తలకు శిక్షణాతరగతులు నిర్వహించాలని, ఈ సందర్భంగా డిజిటల్ మెంబర్ షిప్ ప్రక్రియకు సంబంధించిన విధి విధానాలపై శిక్షణ ఇవ్వాలని సమావేశం ఏకాభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా,పార్టీ ప్రధాన కార్యదర్శులు, మండలి మరియు శాసనసభా పక్షాల ఉప నాయకులు పాల్గొన్నారు

# జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండోవిడుత పంపిణీ

## రెండోవిడతపై 21న కేబినేట్‌లో ఖరారు చేస్తాం

## స్పెషల్ డ్రైవ్ ద్వారా డబుల్ ఇళ్లు పంపిణీ

## అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి



**హైదరాబాద్,మే12 :** రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఆదిలాబాద్‌లో ప్రారంభిస్తామని చెప్పారు. మంగళవారం గృహనిర్మాణశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల విధివిధానాలను ఈనెల 21న జరిగే మంత్రివర్గ సమావేశంలో ఖరారు చేస్తామని పొంగులేటి చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం స్థలాలు గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. హైదరాబాద్‌లో స్థలాలు ఉన్నవారికి ఈ నెలాఖరులోపు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొలిక్కి వచ్చిన నేపథ్యంలో సీఎం రేవంత్ సూచన మేరకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 వ తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడతను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21 వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులతో మంత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, రంగారెడ్డి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి శ్రీధర్ బాబు, హైదరాబాద్ ఇన్ ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి మహ్మద్ అజారుద్దీన్, శాసన మండలిలో చీఫ్ విప్ మహేందర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం దూరదృష్టి లేకుండా హైదరాబాద్ నగరానికి దూరంగా డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించడం వల్ల జరిగిన నష్టం కళ్లముందే కనిపిస్తున్నదన్నారు. అటువంటి తప్పు పునరావృత్తం కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లను నిర్మించే విధంగా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకుని స్థలాలను గుర్తించి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆనాటి ప్రభుత్వం నగరానికి 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో 2 బిహెచ్ కె ఇండ్లను నిర్మించి హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వారికి కేటాయించడం వల్ల తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశ్యంతో ఇండ్లు తీసుకున్న లబ్దిదారులు అక్కడ నివసించడానికి సంసిద్ధతం వ్యక్తం చేయడం లేదని క్షేత్ర స్థాయి పరిశీలనల్లో స్పష్టమైందన్నారు. ఈ అంశాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని ఏ నియోజకవర్గానికి సంబంధించి ఆ నియోజకవర్గంలోనే ప్రభుత్వ స్థలాలు, మురికివాడలు, భూదాన్, గతంలో వివిధ పథకాల కింద నిర్మించిన ఇళ్లు శిధిలావస్థలో ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన

ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ విషయంలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యులను చేయాలని అధికారులను ఆదేశించారు. 2 బిహెచ్ కె ఇండ్లకు లబ్దిదారులను కేటాయించడానికి యుద్ధప్రాతిపదికన స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పూర్తి అయిన వాటికి, వివిధ నిర్మాణ దశల్లో ఉన్న వాటికి ఈ నెలాఖరు కల్లా లబ్దిదారులను గుర్తించాలని, అది కూడా ఆ కాలనీలకు అయిదు నుంచి ఎనిమిది కిలోమీటర్ల లోపు ఉన్న వారినే ఎంపిక చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే నిర్మాణాలన్నీ పూర్ఖైన ఇండ్లలో లబ్దిదారులు ఉండేలా చూసేలా నిరంతరం పర్యవేక్షించా లన్నారు. ఈ కాలనీల్లో మంచినీరు, డ్రైనేజి, విద్యుత్ వంటి కనీస సౌకర్యాల కల్పనకు వేగవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ పరిధిలో ఇండ్ల స్థలాలు ఉండి అర్హులైన లబ్దిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరక్టర్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని, పనితీరు మెరుగుపడాలని అన్నారు. పిడిలు తమ పరిధిలో గతంలో నిర్మించిన జెన్ఎన్ యుఆర్ఎం, రాజీవ్ గృహకల్ప, వాంబే హౌసింగ్ కాలనీలన్నిటిని సందర్శించాలని స్పష్టంగా నిర్దేశిరచారు. అంగుళం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి పొంగులేటి హెచ్చరించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో యుఎల్ సి భూములు కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ, నిబంనలకు విరుద్ధంగా కొంత భాగాన్ని రిజిస్ట్రేషన్ చేశారని , స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి సమావేశంలో మంత్రి దృష్టికి తీసుకుని రాగా వెంటనే సంబంధిత సబ్ రిజిస్ట్రార్?పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. శాశ్వత భవనాలు లేని ఆర్డీవో, తహశీల్దార్, సబ్ రిజస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. రెవెన్యూ, ఫారెస్టు సరిహద్దు వివాదాలకు ముగింపు పలికేలా రెండు శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం సహించం

**సజావుగా వరి, మొక్కజొన్న కొనుగోళ్లు**

**ధాన్యం వెంటనే లారీల్లో తరలించాల్సిందే**

**అవసరమైతే పోలీస్ సాయంతో ధాన్యం సేకరణ**

**లారీలు పంపకుంటే క్రిమినల్ కేసులు పెట్టండి**

**కలెక్టర్లకు సిఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు**



**హైదరాబాద్,మే12 :** ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఉపేక్షించొద్దని.. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకు వెనకాడవద్దని ముఖ్యమంత్రి ఆదేశించారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగొద్దని తెలిపారు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని సూచించారు. మంగళవారం.. జిల్లా కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోలు, వరి ధాన్యం సేకరణపై జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎం ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని.. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటి కప్పుడు గోడౌన్స్‌కు తరలించాలని అన్నారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాల్సిందే అని.. ప్రతి అధికారి జవాబుదారీ తనంతో వ్యవహరించాల్సిందే అని తేల్చిచెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకు ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. గోడౌన్స్ సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతుబజార్లు, ఫంక్షన్ హాల్స్‌ను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళికలుండాలని తెలిపారు. కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు సీఎస్‌కు పోర్ట్ పంపించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ధాన్యం లోడింగ్‌లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమామీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని రేవంత్ తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో లారీల కొరత ఉంటే ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని సూచించారు. అకాల వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అకాల వర్షాల సమయంలో నష్టం జరగకుండా శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని సీఎం ఆదేశించారు. వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఐకేపీ సెంటర్‌కు ఒక అధికారిని నియమించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలన్నారు. మిషన్ మోడ్‌లో పనిచేస్తేనే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని తెలిపారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు తలెత్తవని.. ఏ సమస్య వచ్చినా కలెక్టర్లదే బాధ్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో కుల ప్రసక్తి ఉండదు

**చట్టం అందరికీ ఒకేలా ఉంటుంది**

**పొన్నం వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమన్న పిసిసి చీఫ్**

**హైదరాబాద్,మే12 :** తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలను టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఖండించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసు వ్యవహారంలో మంత్రి పొన్నం చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి లేదా ప్రభుత్వానికి పొన్నం వ్యాఖ్యలతో ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. మంగళవారం గాంధీభవన్‌లో మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. కులసంఘం మధ్యవర్తిత్వం, వివాహం ద్వారా ఇలాంటి తీవ్రమైన కేసులను పరిష్కరించుకోవాలని పొన్నం అన్నారని తెలిపారు. పొన్నం సూచనలను కాంగ్రెస్ ఖండిస్తోందని మహేశ్ గౌడ్ వ్యాఖ్యానించారు. మైనర్ల విషయంలో చట్టపరంగా ఇబ్బందులు తప్పవని చెప్పుకొచ్చారు. పోక్సో చట్టప్రకారం నిందితులకు కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. నేర పరిశోధనలో నిందితుడి కులం లేదా సామాజిక హోదాతో సంబంధం లేదని తెలిపారు. బండి సంజయ్ ఈ కేసులో కుల రాజకీయాలను తీసుకురావడం దురదృష్టకరమని అన్నారు. ఈ కేసులో ఎవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయాల్సిన అవసరం కాంగ్రెస్‌కి ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని తేల్చిచెప్పారు. 'నారీ శక్తి' అని నినాదాలు చేసే బీజేపీ, ఇప్పుడు బాలికపై జరిగిన దాడి విషయంలో మౌనంగా ఉండటం దేనికి సంకేతం..? అని మహేశ్ గౌడ్ ప్రశ్నించారు. బాలిక కుటుంబ సభ్యులను భగీరథ్ బెదిరిస్తున్నట్లు వస్తున్న వార్తలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని అన్నారు. నిజమని తేలితే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కేసు విషయంలో ఎలాంటి రాజకీయ జోక్యం, కుల మతాల ప్రభావం లేకుండా పారదర్శకంగా విచారణ జరుగుతుందని స్పష్టం చేశారు. నిందితుడు ఎంతటి శక్తివంతుడైనా సరే, బాధితురాలికి తాము అండగా నిలుస్తామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# సనత్‌నగర్ టిమ్స్‌లో వైద్యసేవల ట్రయల్ రన్

**స్వయంగా పరిశీలించిన మంత్రి దామోదర**

**హైదరాబాద్,మే12 :** సనత్‌నగర్ టిమ్స్‌లో జరుగుతున్న వైద్య సేవల ట్రయల్ రన్‌ను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు. హాస్పిటల్ బ్లాకులన్నీ మంత్రి కలియ తిరిగారు. ఓపీ రిజిస్ట్రేషన్, ఐపీ వార్డులు, ఎమర్జెన్సీ డిపార్ట్ మెంట్, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ల్యాబులు, మెకనైజ్డ్ ల్యాండ్రీ, కిచెన్ తదితర అన్ని డిపార్ట్‌మెంట్లను మంత్రి పరిశీలించారు. పెండింగ్ పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి సూచించారు. హాస్పిటల్‌కు నీళ్లు, పవర్ సప్లైలో ఎలాంటి ఆటంకం ఉండకూడదని, 24 గంటల సరఫరా ఉండాలని మంత్రి సూచించారు. ఫైర్ సేఫ్టీ విషయంలో రాజీ ఉండకూడదని, అన్ని ఫ్లోర్లలో మరోసారి పూర్తిస్థాయి పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. రిసెప్షన్ ఏరియా, హెల్ప్ డెస్క్, ఓపీ కౌంటర్లు, వెయిటింగ్ హాల్, ఓపీ కన్సల్టేషన్ రూమ్స్, డయాగ్నస్టిక్స్, ఇన్ పేషెంట్ వార్డులు, ఫార్మసీ తదితర ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి.. రిజిస్ట్రేషన్ కౌంటర్స్, ఫార్మసీ కౌంటర్స్ పెంచాలని మంత్రి సూచించారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎక్స్ రే, ఆల్ట్రాసౌండ్ తదితర యంత్రాలను పరిశీలించిన మంత్రి.. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ యంత్రాలు పూర్తిస్థాయిలో పేషెంట్లకు ఉపయోగపడాలని, ఇందుకు అవసరమైన డాక్టర్లు, ఇతర సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలని ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రారంభం నాటికి అన్ని సౌకర్యాలతో హాస్పిటల్‌ను సిద్ధం చేయాలని, పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. జూన్‌లో సనత్‌నగర్ టిమ్స్‌ను ప్రారంభిస్తామని అన్నారు. ఇక్కడ సక్సెస్‌ఫుల్‌గా వైద్య సేవల ట్రయల్ రన్ జరుగుతోంది. కొన్ని ఫినిషింగ్ వర్క్స్ జరుగుతున్నాయి. ఆ పనులన్నీ గడువులోగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించామన్నారు. ఇది వెయ్యి బెడ్ల హాస్పిటల్, ఇందులో 300 ఎమర్జెన్సీ బెడ్లు ఉంటాయి. అత్యవసర పరిస్థితుల్లో బాధితుల ప్రాణాలు నిలిపే గొప్ప హాస్పిటల్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నాం. గుండె సంబంధిత వ్యాధుల చికిత్సలు, ఆర్గాన్ ట్రాన్స్‌ఎ÷-లాంటేషన్ సర్జరీలకు ఈ హాస్పిటల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఉంటుందని వివరించారు. ఇక్కడే అద్భుతమైన రీసెర్చ్ సెంటర్ అందుబాటులోకి తీసుకొస్తాం అని దామోదర అన్నారు.

# నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనది

**వారి సేవలు చిరస్మరణీయం**

**వారిది ఉదయోగం కాదు...నిరంతర సేవ**

**1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందచేత**

**వారి సేవలు నిరుపమానమని అన్న మంత్రి దామోదర**

**హైదరాబాద్,మే12 :** ఆరోగ్యశాఖలో ఉద్యోగాలు పొందిన 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నియామక పత్రాలు అందజేశారు. కోఠి ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, మీర్జా రహ్మత్ బేగ్, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, డీపీహెచ్ రవింద్ర నాయక్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నర్సులను ఉద్దేశించి ప్రసంగించారు.

అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని నర్సులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించిన నర్సింగ్ ఆఫీసర్లకు, వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు.

అంతర్జాతీయ నర్సుల దినోత్సవం రోజునే నియామక పత్రాలు అందించడం ఎంతో సంతోషంగా ఉంది. ఈరోజు మీకు జీవితాంతం గుర్తిండిపోతుంది. నర్సింగ్ అనేది కేవలం ఒక వృత్తి కాదు.. మానవత్వానికి చేసే గొప్ప అవకాశం. రోగులకు చికిత్స అందించడమే కాదు.. వారికి ధైర్యం, భరోసా, ఆశను కల్పించేది నర్సులే.

ప్రపంచ నర్సింగ్ రంగానికి మార్గదర్శకురాలైన ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలను ఈ సందర్భంగా మనం స్మరించుకోవాలి. పరిశుభ్రత, క్రమశిక్షణ, శాస్త్రీయ వైద్య సేవల ప్రాముఖ్యతను

ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయురాలు ఆమె. మీరు అందరూ ఆమెను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలి. కోవిడ్‌లో కుటుంబ సభ్యులు కూడా పేషెంట్ల దగ్గర ఉండలేని పరిస్థితి, అటువంటి భయంకర మైన పరిస్థితుల్లో కూడా నర్సులు సేవలు అందించారు. తెలంగాణ ప్రజలు ఆ సేవలను ఎప్పటికీ గుర్తుంచు కుంటారు. గతంలో ప్రభుత్వ హాస్పిటళ్లలో భారీగా ఖాళీలు ఉండటం వల్ల వైద్య సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి ఉండేది. ఈ సమస్యను మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని భారీ స్థాయిలో నియామకాలు చేపట్టింది. గత రెండున్నరేళ్లలో ఆరోగ్యశాఖలో దాదాపు 13 వేల పోస్టులను భర్తీ చేశాం. ఇదే గ్రౌండ్‌లో ఇప్పటికే 1,257 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు నియామక పత్రాలు అందజేశాం. ఇక్కడే 623 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్‌లకు నియామక పత్రాలు అందించాం. ఇక్కడే 132 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు నియామక పత్రాలు అందించాం. ఈరోజు ఇక్కడే 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందిస్తున్నాం అని మంత్రి వివరించారు. గతంలో 6956 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు భర్తీ చేశాం. రెండున్నర సంవత్సరాల్లో 9 వేల నర్సింగ్ పోస్టులను భర్తీ చేసిన ఘనత మన ప్రభుత్వానికి దక్కుతుంది. దాదాపు మరో 5 వేల పోస్టుల భర్తీ పక్రియ కొనసాగుతోంది. ఇందులో సుమారు 2 వేల ఏఎన్ఎం పోస్టుల ఫలితాలు మరో ఒకటి, రెండు రోజుల్లో ప్రకటిస్తాం. న్యాయపరమైన కారణాలతో ఆలస్యమైన 732 ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీని కూడా త్వరలో పూర్తి చేస్తాం అని మంత్రి దామోదర వెల్లడించారు.

# బండి కుమారుడిని తప్పించే యత్నం

**సిట్ విచారణ పేరుతో కాలయాపన**

**మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శలు**

**నిజామాబాద్,మే12 :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు, దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రమంత్రి కుమారుడు పరారీలో ఉన్నాడని అనడం హాస్యాస్పదమని అన్నారు. సిట్ విచారణ పేరిట నిందితుడిని సీఎం రేవంత్ రెడ్డి తప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఒక మైనర్ బాలికకు డ్రగ్స్ ఇచ్చి, మద్యం తాగించి అత్యాచారం చేసినట్లు ఆరోపణలు వస్తున్నా.. పోలీసులు మూడు నెలలుగా ఫిర్యాదు తీసుకోకుండా తాత్సారం చేయడం వెనుక రాజకీయ ఒత్తిడి ఉందని వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. మీడియాలో వార్తలు వచ్చిన వెంటనే గత్యంతరం లేక పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. పోక్సో కేసులో బాధితురాలికి రక్షణ కల్పించాల్సింది పోయి.. ఆమెపైనే హనీట్రాప్ కేసు పెట్టడం దారుణమని మండిపడ్డారు. మైనర్ బాలిక హనీట్రాప్ చేస్తుందా అని ప్రశ్నించారు. బాధితురాలిపైనే రివర్స్ కేసులు పెట్టడం చూస్తుంటే రేవంత్ రెడ్డి, బండి సంజయ్ ఒక్కటేనని అర్థమవుతుందని అన్నారు. బాధితురాలిపైనే రివర్స్ కేసులు పెట్టడం చూస్తుంటే రేవంత్ రెడ్డి, బండి సంజయ్ ఒకటేనని అర్థమవుతోందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్‌ది ఫెవికాల్ బంధమని విమర్శించారు. వీళ్లిద్దరూ కలిసి వ్యాపారాలు చేస్తున్నారని, కుంభకోణాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అందుకే కేంద్రమంత్రి కొడుకుపై ఇంత పెద్ద నేరం మోపబడినా ప్రభుత్వం మిన్నకుండిపోయిందని అన్నారు. ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా దీనిపై స్పందించకపోవడం వెనుక మర్మమేంటని ప్రశ్నించారు. పొద్దున లేస్తే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు మీద విషం చిమ్మే బండి సంజయ్.. తన కొడుకు చేసిన నేరంపై ఏం సమాధానం చెబుతారని వేముల నిలదీశారు. తన కొడుకుపై వచ్చిన పోక్సో కేసుపై నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పోక్సో కేసులో నిందితుడైన బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని.. ఈ కేసులో రాజకీయ జోక్యం లేకుండా నిష్పక్షపాతంగా విచారణ జరపాలని.. బాధితురాలికి, ఆమె కుటుంబానికి తక్షణమే పూర్తిస్థాయి రక్షణ కల్పించాలి అని డిమాండ్ చేశారు. రాష్ట్ర పోలీసులు ఇప్పటికైనా ఒత్తిళ్లకు లొంగకుండా చట్టాన్ని గౌరవించాలని, బాధిత మైనర్ బాలికకు న్యాయం జరిగే వరకు తాము పోరాడుతామని స్పష్టం చేశారు.

# నీట్ పేపర్ లీకేజీకి కేంద్రానిదే బాధ్యత

**పేపర్ లీకేజ్‌పై సమగ్ర విచారణ చేపట్టాలి**

**ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్**

**హైదరాబాద్,మే 12 :** దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష రద్దు కావడంపై ఎంపీ చామల కిరణ్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మే 3వ తేదీన జరిగిన నీట్ పరీక్షను రద్దు చేశారని అన్నారు. నీట్ పరీక్ష రద్దుకు నేషనల్ టెస్ట్ ఏజెన్సీ, సెంట్రల్ ఎడ్యుకేషన్ మినిస్ట్రీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష రద్దుతో విద్యార్థులు తమ అకడమిక్ ఇయర్‌ను కోల్పోయే అవకాశం ఉందన్నారు. నీట్ పరీక్ష రద్దుపై బీజేపీ ప్రభుత్వం చర్చ చేపట్టాలన్నారు. దేశంలో అనేక విషయాలపై చర్చ చేసే బీజేపీ విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశంపై సమాధానం చెప్పాలని ఎంపీ డిమాండ్ చేశారు. బీజేపీకి పాలనపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తు, సామాన్యుడి అవసరం బీజేపీకి వద్దా అని నిలదీశారు. నీట్ పరీక్ష రద్దుకు పూర్తిగా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం డబ్బులు ఖర్చు పెట్టి కోచింగ్‌లు ఇప్పించి నీట్ పరీక్ష రాయించారని తెలిపారు. రాజస్థాన్‌లో నీట్ పేపర్ లీకేజీ ఘటనపై కేంద్రం పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలన్నారు. విద్యార్థుల అకడమిక్ ఇయర్ దెబ్బతినకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంపీ చామల కిరణ్ రెడ్డి డిమాండ్ చేశారు.

# కామారెడ్డిలో రైల్‌రోకో కేసు

**కవితకు రైల్వే కోర్టు సమన్సు**

**నేడు సికింద్రాబాద్ కోర్టుకు హాజరు కావాలని ఆదేశం**

**హైదరాబాద్,మే12 :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల డిమాండ్ చేస్తూ నిర్వహించిన రైల్ రోకో కార్యక్రమం కేసులో తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు సమన్లు జారీ అయ్యాయి. బుధవారం విచారణకు హాజరు కావాలని సికింద్రాబాద్ రైల్వే కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కొంతకాలం క్రితం కామారెడ్డి జిల్లా కేంద్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కవిత ఆధ్వర్యంలో రైల్ రోకో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే రవాణాకు అంతరాయం కలిగిందని రైల్వే ఏఎస్ఐ రవీంద్రబాబు ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. రైల్ రోకోతో నిజామాబాద్-హైదరాబాద్ రూట్‌లో అంతరాయం ఏర్పడింది. నేటి ఉదయం 10:30కి విచారణకు హాజరు కావాలని సికింద్రాబాద్ రైల్వే కోర్టు ఆదేశించింది. దేవగిరి ఎక్స్‌ప్రెస్‌తో పాటు గూడ్స్ రైలు నిలిపివేతపై రైల్వే యాక్ట్ సెక్షన్ల కింద కవితపై న్యాయస్థానం కేసు నమోదు చేసింది. ఈ కేసులో కవితతో పాటు మరో 12 మంది బీఆర్ఎస్ నాయకులపై కూడా కేసులు నమోదయ్యాయి. రైల్వేచట్టాల ఉల్లంఘన, ప్రజా రవాణాకు ఆటంకం కలిగించడం వంటి ఆరోపణలపై కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

ఈ కేసు విచారణలో భాగంగా నేడు సికింద్రాబాద్ రైల్వే కోర్టుకు కవిత, బీఆర్ఎస్ నేతలు హాజరవుతారా లేదా అనేది ఉత్కంఠగా మారింది. బీసీ రిజర్వేషన్ల అంశం తెలంగాణ రాజకీయాల్లో కీలకంగా మారిన నేపథ్యంలో ఈ కేసు ప్రాధాన్యం సంతరించుకుంది.

# నేషనల్ డెయిరీతో నార్మల్ ఒప్పందం

**పాడిరైతులకు తొలుత పదికోట్లు చెల్లింపు**

**హైదరాబాద్,మే12 :** నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం లిమిటెడ్ (నార్మల్), నేషనల్ డెయిరీ డెవలంప్‌మెంట్ బోర్డుతో త్రైపాక్షిక ఒప్పందం కుదర్చుకుంది. 15 ఏళ్లపాటు డెయిరీ అభివృద్ధి చేసే బాధ్యతను అది తీసుకోనుంది. ఒప్పందంలో భాగంగా మొదట పాడి రైతుల బకాయిలను చెల్లించేందుకు రూ.10 కోట్ల రూపాయలను చెల్లించనుంది. ఈ మేరకు ఎన్‌డిబిబి అధికారులతో తెలంగాణ రాష్ట్ర డెయిరీ విభాగం అధికారులు ఒప్పందాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, పశుసంవర్ధక, డెయిరీ, ఫిషరీస్ సెక్రటరీ ఇలంబర్తి, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఔఆఆః అధికారులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లాలో భారీ అగ్నిప్రమాదం

**గోడౌన్‌లో మంటలు చెలరేగి వాహనాలు దగ్ధం**

**సంగారెడ్డి,మే12 :** సంగారెడ్డి జిల్లాలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. పటాన్‌చెరులోని శ్రీరామ్ ఆటో ఫైనాన్స్‌కు చెందిన వాహనాల గోడౌన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో మూడు టిప్పర్లు, డీసీఎం, రెండు ఆటోలు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోడౌన్‌లో నిల్వ ఉంచిన వాహనాల మధ్య నుంచి మంటలు వ్యాపించాయి. క్షణాల్లోనే మంటలు తీవ్రరూపం దాల్చడంతో గోడౌన్ మొత్తం దగ్ధమైంది. అక్కడ పార్క్ చేసిన పలు కార్లు పూర్తిగా కాలిపోయినట్లు సమాచారం. అగ్నిప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# అసోం సీఎంగా హిమంత బిశ్వశర్మ

## ప్రమాణ కార్యక్రమానికి ప్రధాని హాజరు

## ఎన్‌డి ముఖ్యమంత్రుల్లో చంద్రబాబు రాక

**గౌహతి :** అస్సాం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వశర్మ ప్రమాణస్వీకారం చేశారు. అస్సాంలో వరుసగా రెండోసారి సీఎం పదవిని చేపట్టిన తొలి భాజపా నేతగా హిమంత నిలిచారు. ఆయనతో పాటు మరో నలుగురు మంత్రులు ప్రమాణం చేశారు. ఉదయం 11.40 గంటలకు గువాహటిలోని వెటర్నరీ కాలేజీ ఫీల్డ్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. బిశ్వ శర్మతో పాటు బీజేపీ నుంచి ఇద్దరు, ఏజీపీ, బీపీఎఫ్ నుంచి ఒక్కొక్కరు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. అస్సాంలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడం ఇది వరుసగా మూడోసారి కాగా, అసోం ముఖ్యమంత్రిగా శర్మ పగ్గాలు చేపట్టడం రెండోసారి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, పలువురు కేంద్ర మంత్రులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సహా పలువురు ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు హాజరయ్యారు. హిమంత బిశ్వ శర్మతో పాటు రామేశ్వర్ తేలి, అతుల్ బోరా, చరణ్ బోరో, అజంతా నియోగ్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, కొత్త టీమ్‌తో కలిసి పూర్తి అంకితభావంతో పటిష్టమైన, మరింత అభివృద్ధి చెందిన, సుసంపన్నమైన అస్సాంను నిర్మిస్తామని శర్మ ప్రకటించారు. హిమంత బిశ్వ శర్మ తొలిసారి 2021లో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. మొత్తం 126 స్థానాల్లో ఎన్డీయే 102 సీట్లు గెలుచుకుంది. బీజేపీ 82 సీట్లు దక్కించుకోగా, భాగస్వామ్య పార్టీలైన ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 సీట్లు గెలుచుకున్నాయి. కాంగ్రెస్ సారథ్యంలోని కూటమికి 19 సీట్లు వచ్చాయి. భాజపా ఒక్కటే 82 సీట్లు గెలుచుకోగా.. దాని కూటమి భాగస్వాములైన ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 సీట్లు దక్కించుకున్నాయి. దీంతో ఎన్డీఏ రాష్ట్రంలో వరుసగా మూడోసారి తమ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. ఈ కార్యక్రమానికి ముందు వేదిక వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తచ్చాడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. తనిఖీ చేయగా అతడి వద్ద తుటాలు లభ్యమయ్యాయి. వెంటనే అనుమానితుడిని బసిస్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టామన్నారు. హిమంత ప్రమాణస్వీకార కార్యక్రమానికి పీఎం మోదీ సహా పలువురు కీలక నేతలు హాజరైన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

# తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌గా జేసీడీ ప్రభాకర్

## డిప్యూటి స్పీకర్‌గా రవిశంకర్ ఎన్నిక

**చెన్నై:** తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌గా టీవీకే ఎమ్మెల్యే జేసీడీ ప్రభాకర్ మంగళవారం నాడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీవీకేకు చెందిన మరో ఎమ్మెల్యే రవిశంకర్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక కోసం ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు ప్రోటెం స్పీకర్ ఎంవీ కరప్పయ్య తెలిపారు. తొలుత ప్రభాకర్ నామినేషన్‌ను ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ప్రతిపాదించారు. ఒకే నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవంగా స్పీకర్ ఎన్నిక జరిగింది. అనంతరం ప్రోటెం స్పీకర్‌గా తన పాత్ర ముగిసినట్టు కరుప్పయ్య ప్రకటించారు. ఆ వెంటనే సభాసాంప్రదాయం ప్రకారం స్పీకర్ ప్రభాకర్‌ను ఆయన చైర్ వరకూ సభానేత కేఏ సెంగోట్టియన్, ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ తోడ్కొని వెళ్లారు. ఆయనకు అభినందనలు తెలిపారు. స్పీకర్‌గా ప్రభాకర్ బాధ్యతలు చేపట్టిన వెంటనే డిప్యూటీ స్పీకర్ ఎన్నికను చేపట్టారు. డిప్యూటీ స్పీకర్ పదవికి తురైయూర్ టీవీకే ఎమ్మెల్యే ఎం.రవిశంకర్ ఒక్కరే నామినేషన్ వేశారని, దీంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైందని ప్రభాకర్ ప్రకటించారు. రవిశంకర్ నామినేషన్‌ను సెంగోట్టియన్ ప్రతిపాదించారు.

# గుడులు, బడుల వద్ద మద్యం షాపుల తొలగింపు

## సీఎంను అభినందిస్తూ విశాల్ పోస్ట్

**చెన్నై:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తీసుకున్న సాహసోపేత నిర్ణయంపై సినీ నటుడు విశాల్ ప్రశంసల వర్షం కురిపించారు. ప్రార్థన మందిరాలు, విద్యాసంస్థలు, ముఖ్యంగా పాఠశాలల సమీపంలో ఉన్న 717 మద్యం దుకాణాలను మూసివేస్తున్నట్లు సీఎం విజయ్ ప్రకటించడంపై విశాల్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఈ నిర్ణయం ఎంతో మంది విద్యార్థినులకు, సామాన్య ప్రజలకు పెద్ద ఊరటనిస్తుందని ఆయన కొనియాడారు. అలాగే విశాల్ తన పోస్ట్‌లో ఒక ఘటనపై ప్రస్తావిస్తూ.. 'ఆర్.కె. నగర్‌లో నేను కలిసిన ఒక విద్యార్థిని, ప్రతిరోజూ స్కూల్ నుంచి ఇంటికి వెళ్లేటప్పుడు మద్యం షాపుల దగ్గర ఎదురయ్యే వేధింపుల గురించి, ఆ ఒత్తిడి గురించి ఫిర్యాదు చేసింది. ఆ అమ్మాయి లాంటి ఎంతో మంది విద్యార్థినులు, సామాన్యులు నేడు మీ నిర్ణయం పట్ల ఎంతో సంతోషంగా ఉన్నారు. వారి ముఖాల్లో మీరు చిరునవ్వు నింపారు' అని విశాల్ పేర్కొన్నారు. పాఠశాలల సమీపంలో మద్యం షాపులను తొలగించడం వల్ల సమాజంలో ఒక పెద్ద సమస్య తొలగిపోతుందని, సీఎం విజయ్ మరియు ఆయన ప్రభుత్వాన్ని తాను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని విశాల్ చెప్పుకొచ్చాడు.

# మోడీ ఉపయోగించే విమానం అమ్మేయాలి

## అప్పడే ఖర్చులు తగ్గించుకోవడం సాధ్యం

## స్వామి అవిముక్తేశ్వరానంద సంచలన వ్యాఖ్యలు

**లక్నో:** పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో దేశ ప్రజలకు ప్రధాని మోదీ కొన్ని పొదుపు సూచనలు చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్ పర్యటన సమయంలోఆయన బహిరంగ సభలో పాల్గొని కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలన్నారు. బంగారం కొనుగోళ్లను ఏడాది పాటు ఆపాలన్నారు. డీజిల్, పెట్రోల్ వినియోగాన్ని తగ్గించుకోవాలన్నారు. ప్రజా రవాణా వ్యవస్థపై ఎక్కువగా ఆధారపడాలని సూచించారు. రాబోయే కరువు, దారిద్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రధాని మోదీ ఆ సూచన చేసినట్లు తెలుస్తోంది. అయితే ప్రధాని పొదుపు సూచనపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. దుబారా ఖర్చులు చేయవద్దు అంటే ముందుగా ప్రధాని వినియోగించే సుమారు 8 వేల కోట్ల ఖరీదైన ఎయిర్ ఇండియా వన్ విమానాన్ని అమ్మేయాలని స్వామి అవిముక్తేశ్వరానంద అన్నారు. ఆ విమానానికి బదులుగా ఇంధనం తక్కువ ఖర్చు అయ్యే విమానాలను వాడాలని స్వామిజీ విమర్శించారు. ఖర్చులు తగ్గించు కోవాలని ప్రజలకు చెప్పడం కాదు, ముందుగా ఆ విమానాన్ని అమ్మేసేయాలని ఆయన అన్నారు. యూపీలోని సోన్‌భద్రతలో జరిగిన గోవిష్ట్ యాత్రలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పొదుపు అనేది అధికారంలో ఉన్న వ్యక్తుల నుంచే మొదలు కావాలని ఆయన అన్నారు. ధర్మం అనేది ఇంటి నుంచే మొదలు కావాలని అవిముక్తేశ్వరానంద అభిప్రాయపడ్డారు.

# నీట్ ప్రవేశ పరీక్ష రద్దు

## పేపర్ లీక్ వ్యవహారంతో ఎన్‌టీఏ నిర్ణయం

## సీబీఐ విచారణకు ఆదేశించినట్లు వెల్లడి




**న్యూఢిల్లీ:** జాతీయ అర్హత పరీక్ష నీట్ యూజీ-2026ను రద్దు చేసారు. పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. నీట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం రాజస్థాన్‌లో లీకైనట్లు వచ్చిన వార్తలు పెనుదుమారం రేపాయి. ఈ నేపథ్యంలో జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా మే 3న జరిగిన నీట్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. త్వరలోనే కొత్త పరీక్ష తేదీలను వెల్లడిస్తామని తెలిపింది. విద్యార్థుల ప్రయోజనాలు, జాతీయ పరీక్షా వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. కొత్త పరీక్ష కోసం విద్యార్థులు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, పరీక్ష ఫీజు చెల్లించనక్కర్లేదని తెలిపింది. పరీక్ష తేదీలను నిర్ణయించిన తర్వాత మళ్లీ అడ్మిట్ కార్డులు విడుదల చేస్తామని పేర్కొంది. ఇక, ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. ఈనెల 3న జరిగిన నీట్ పరీక్షలో కెమిస్ట్రీ విభాగంలో వచ్చిన సుమారు 120కి పైగా ప్రశ్నలతో ఉన్న ఓ ప్రాక్టీసు పేపరును గుర్తించినట్లు రాజస్థాన్ అదనపు డీజీపీ విశాల్ బన్సాల్ వెల్లడించారు. ఈ మెటీరియల్ రాజస్థాన్‌లోని సికార్‌లో పరీక్షకు 42 గంటల ముందు వాట్సాప్‌లో అందుబాటులోకి వచ్చినట్లు గుర్తించారు. ఇందులోని సమాచారం.. నీట్ ప్రశ్నపత్రంలోని 600 మార్కుల ప్రశ్నలతో పోలి ఉండటం గమనార్హం. కొన్ని ప్రశ్నల్లోని జవాబుల క్రమం కూడా అచ్చం ఒకేలా ఉండడం పలు అనుమానాలకు తావిచ్చింది. ఆ ప్రాక్టీసు పేపరు కేరళలోని ఓ వైద్య కళాశాలలో చదువుతున్న ఎంబీబీఎస్ విద్యార్థికి చెందినదిగా దర్యాప్తులో వెల్లడైంది. ఆ వ్యక్తి ఈనెల 1న సికార్‌లోని తన స్నేహితుడికి ఈ మెటీరియల్ ఇచ్చాడని.. ఆ తర్వాత అది పీజీ వసతిగృహాలు, కోచింగ్ నెట్‌వర్క్‌లు, కెరీర్ కౌన్సిలర్లు, పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు చేరిందని అధికారులు తెలిపారు. ఆ మెటీరియల్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీకి సంబంధించిన 300కు పైగా చేతిరాత ప్రశ్నలు ఉన్నాయని వెల్లడించారు. దీనిని విద్యార్థులకు రూ.20వేల నుంచి రూ.2 లక్షల వరకు విక్రయించారని, కొందరు అభ్యర్థుల నుంచి ముందుగానే రూ.30 వేలకు పైగా వసూలుచేశారని గుర్తించామని రాజస్థాన్ పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే పలువురు అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేశారు.

### లక్షల మంది విద్యార్థుల కలలు కల్లలు

#### నీట్ పరీక్ష రద్దుపై మండిపడ్డ రాహుల్

**న్యూఢిల్లీ :** నీట్ ప్రశ్నాపత్రం లీక్ కారణంగా నీట్ పరీక్ష రద్దు కావడంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని లక్షల మంది కష్టాన్ని, కలల్ని బీజేపీ ప్రభుత్వం ఛిద్రం చేసిందని విమర్శించారు. ఇది కేవలం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదని, యువత భవిష్యత్తును కాలరాసే నేరమని ఆరోపించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో రాహుల్ గాంధీ ఓ ట్వీట్ చేశారు. దేశవ్యాప్తంగా 22 లక్షల మందికి పైగా విద్యార్థుల కష్టం, తల్లిదండ్రుల త్యాగాలు, ఎన్నో కుటుంబాల ఆశలు ఈ అవినీతి పాలన వల్ల నాశనమయ్యాయని రాహుల్ గాంధీ అన్నారు. కొంతమంది తండ్రులు అప్పులు చేశారని, తల్లులు తమ నగలు అమ్మారని, లక్షలాది మంది విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివారని, అయితే పేపర్ లీకులు, ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యా వ్యవస్థలో అవినీతి వారికి శాపంలా మారాయని విమర్శించారు. ప్రతిసారి పేపర్ మాఫియా తప్పించుకుంటోందని, నిజాయతీగా చదివిన విద్యార్థులే శిక్ష అనుభవిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కష్టం కాదు.. డబ్బు, పరిచయాలే భవిష్యత్తును నిర్ణయిస్తే విద్యకు అర్థమేంటి? ప్రధాని చెప్పే అమృత కాలం దేశ యువతకు విష కాలంగా మారింది' అని రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని, పరీక్షల నిర్వహణలో కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు

## నీట్ పేపర్ లీక్ కేసు

### 13మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

**జైపూర్ :** రాజస్థాన్‌లోని సికార్‌లో నీట్ పేపర్ లీక్ కేసు వ్యవహారంలో 13 మందిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వీరిని పోలీసులు విచారిస్తున్నారు. 'గెస్ పేపర్' పేరుతో మార్కెట్‌లోకి ఈ నీట్ ప్రశ్నాపత్రం వచ్చింది. ప్రభుత్వం నిర్వహించిన ప్రశ్నాపత్రంతో ఈ 'గెస్ పేపర్' 100 శాతం సరి పోలినట్లు అధికారులు గుర్తించారు. అలాగే మే 3వ తేదీన ఈ నీట్ పరీక్ష నిర్వహించగా.. అంతకు ముందే ఈ పరీక్ష పేపర్ లీక్ అయినట్లు అధికారులు ధృవీకరించారు. ఈ ప్రశ్నాపత్రం రూ. 20 వేల నుంచి రూ. 2 లక్షల వరకు విక్రయించినట్లు గుర్తించారు. కేరళలోని ఒక ఎంబీబీఎస్ విద్యార్థి వద్ద ఈ పేపర్ లీక్ అయినట్లు పోలీసులు కనుగొన్నారు. మే 1వ తేదీన సికార్‌లోని స్నేహితుడితో ఎంబీబీఎస్ విద్యార్థి ఈ ప్రశ్నాపత్రం పంచుకున్నట్లు తెలుస్తుంది. ఆ తర్వాత కోచింగ్ సెంటర్లు, అభ్యర్థులకు ఈ పేపర్ లీక్ అయినట్లు సమాచారం.నైల్ పరీక్షల్లో అసలు ప్రశ్నాపత్రంలోని 140 ప్రశ్నలు సరి పోలాయి. ఈ 140 ప్రశ్నలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరలయ్యాయి. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం ఈ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ పరీక్ష నిర్వహించే తేదీలు త్వరలో ప్రకటిస్తామని వెల్లడించింది.

# టీవీకే ఎమ్మెల్యేకు మద్రాస్ హైకోర్టు షాక్

## ఒక్కోటుతో గెల్చిన సేతుపతిని ఓటింగ్‌కు దూరం

## విశ్వాస పరీక్షలో ఓటేయవద్దని హైకోర్టు ఆదేశం

**చెన్నై:** తమిళనాడు నూతన ముఖ్యమంత్రి విజయ్ శాసనసభలో తన బలాన్ని నిరూపించుకునేందుకు సిద్ధమవుతున్న వేళ ఒక టీవీకే ఎమ్మెల్యేకు మద్రాస్ హైకోర్టు షాకిచ్చింది. ఈ ఎన్నికల్లో ఒక్క ఓటు తేడాతో నెగ్గిన ఆ ఎమ్మెల్యే.. సభలో సీఎం విజయ్ బలపరీక్షలో పాల్గొనవద్దని ఆదేశించింది. ఈ మేరకు న్యాయస్థానం మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. దాంతో విజయ్ బలపరీక్షలో టీవీకే కూటమి బలం 119 సీట్లకు పడిపోయినట్లయ్యింది. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో శివగంగై జిల్లా తిరుప్పత్తూర్ నియోజకవర్గం నుంచి టీవీకే నేత శ్రీనివాస సేతుపతి విజయం సాధించారు. ఇక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెరియకరుప్పన్‌పై కేవలం ఒకే ఒక్క ఓటు తేడాతో సేతుపతి గెలుపొందారు. డీఎంకే నేత పెరియకరుప్పన్‌కు 83,374 ఓట్లు పోలవగా.. శ్రీనివాస సేతుపతి 83,375 ఓట్లతో విజయాన్ని సొంతం చేసుకున్నారు. అయితే ఈ ఫలితాలపై డీఎంకే నేత పెరియ కరుప్పన్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో పొరపాటు జరిగిందని తన పిటిషన్‌లో ఆరోపించారు. ఈవీఎం ఓట్ల లెక్కింపు ప్రక్రియలోనూ అవకతవకలు చోటుచేసుకున్నాయని, కాబట్టి తిరుప్పత్తూర్‌లో రీకౌంటింగ్ జరపాలని ఆయన న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. అప్పటివరకు శ్రీనివాస సేతుపతి ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పెరియకరుప్పన్ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం.. విజయ్ విశ్వాసపరీక్ష ఓటింగ్‌లో శ్రీనివాస సేతుపతి పాల్గొనవద్దని ఆర్డర్ వేసింది. మద్రాసు హైకోర్టు ఆదేశాలతో బలపరీక్షలో విజయ్‌కు ఒక ఓటు తగ్గినట్ల య్యింది. 234 శాసనసభ స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీలో విజయ్‌కి కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ కలుపుకుని ప్రస్తుతం 120 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. అందులో ఇప్పుడు ఒక ఎమ్మెల్యే బలపరీక్షలో పాల్గొనే అవకాశం లేకపోవడంతో విజయ్ బలం 119కి తగ్గిపోయింది. అయితే విజయ్ బలపరీక్షలో నెగ్గేందుకు మాత్రం ఎలాంటి అవాంతరం లేదు. విజయ్ బలపరీక్షలో నెగ్గడానికి 118 మంది ఎమ్మెల్యేల మద్దతు సరిపోతుంది. శ్రీనివాస సేతుపతికి బలపరీక్షలో ఓటువేసే అవకాశం లేకపోయియినా.. 119 ఓట్లతో విజయ్ బలపరీక్షలో నెగ్గనున్నారు. నేడు అసెంబ్లీలో బలపరీక్షకు విజయ్ సిద్ధం అయ్యారు.

# మరోమారు ఉదయనిధి అనుచిత వ్యాఖ్యలు

## సనాతన ధర్మంపై నోరు పారేసుకున్న డిఎంకె నేత

## ఉదయనిధి వ్యాఖ్యలపై మండిపడ్డ బిజెపి నేత

**చెన్నై:** తమిళనాడు మాజీ ఉప ముఖ్యమంత్రి, డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ మరోసారి సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. మూడేళ్ల క్రితం ఉదయనిధి సనాతన ధర్మంపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. సనాతన ధర్మాన్ని డెంగ్యూ, మలేరియాతో పోల్చుతూ దానిని నిర్మూలించాలని వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. పలువురు కోర్టులలో పిటిషన్లు కూడా వేశారు. తాజాగా, మంగళవారం మధ్యాహ్నం తమిళనాడు అసెంబ్లీలో కూడా ఉదయనిధి అదే తరహా వ్యాఖ్యలు చేశారు. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని అసెంబ్లీ వేదికగా ప్రసంగించారు. అసెంబ్లీ కొత్త స్పీకర్‌గా ఎన్నికైన జె.సి.డి. ప్రభాకర్‌ను అభినందిస్తూ చేసిన ప్రసంగంలో ఉదయనిధి స్టాలిన్ ఈ వ్యాఖ్య చేశారు. ఉదయనిధి వ్యాఖ్యలపై తమిళనాడు బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసన్ ఘాటుగా స్పందించారు. ఎన్నికల్లో ఓటమి ఎదురైనా ఆయన మారలేదని విమర్శించారు. డీఎంకే నిజంగా ఇదే సిద్ధాంతాన్ని నమ్మితే ఎన్నికల మేనిఫెస్టోలో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు హిందూ మతాన్ని నిర్మూలించడమే ఉదయనిధి స్టాలిన్, డీఎంకేల విధానమైతే, దానిని వారి ఎన్నికల మేనిఫెస్టోలో ఎందుకు ప్రస్తావించలేదని మండిపడ్డారు. ఎన్నికల ప్రచార సమయంలో ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మం నిర్మూలన గురించి ఎందుకు మాట్లాడలేదు. ఎన్నికల ప్రచారం చివరి రోజున 'మేం హిందువులకు వ్యతిరేకం కాదు' అని స్టాలిన్ ఎందుకు చెప్పుకున్నారు' అని శ్రీనివాసన్ ప్రశ్నించారు.

# అన్నాడీఎంకేలో లుకలుకలు

## పళనిస్వామి నాయకత్వంపై తిరుగుబాటు

## టివికెకు మద్దతు ప్రకటించిన షణ్ముగం వర్గం

**చెన్నై :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం అన్నాడీఎంకేలో లుకలుకలు బయటపడ్డాయి. పళనిస్వామి నాయకత్వంపై తిరుగుబాటు మొదలయ్యింది. తాజాగా ఆ పార్టీలోని సీవీ షణ్ముగం వర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని తమిళగ వెట్రి కళగంకు మద్దతు ప్రకటించింది. ఆయన వర్గంలో 30 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. డీఎంకేతో చేతులు కలపాలని అన్నాడీఎంకే అనుకుందని, అందుకే పళనిస్వామి వర్గం నుంచి తాము విడిపోయామని మంగళవారంనాడు మీడియాతో మాట్లాడుతూ షణ్ముగం తెలిపారు. ఎన్డీయే కూటమి నుంచి బయటకు వచ్చినట్టు చెప్పారు. వరుస ఓటములకు పళనిస్వామే కారణమని విమర్శించారు. పార్టీ పదవి నుంచి ఆయన దిగిపోవాలని డిమాండ్ చేశారు. అన్నాడీఎంకే గత దశాబ్ద కాలంగా పలు ఓటములను చవిచూసిందని, మూడుసార్లు చిరకాల ప్రత్యర్థి డీఎంకే చేతిలో ఓడిపోతే, గత నెలలో టీవీకే చేతిలో మరో ఓటమి చవిచూసిందని షణ్ముగం తెలిపారు. పార్టీని పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అన్నాడీఎంకే భవిష్యత్తుపై కూలంకషంగా చర్చించాలని అన్నారు. ఎన్నికల్లో విజేతగా నిలిచిన టీవీకేకు మద్దతివ్వాలని మేము నిర్ణయించాం. డీఎంకేకు వ్యతిరేకంగానే అన్నాడీఎంకే పార్టీని స్థాపించడం జరిగింది. 53 ఏళ్లుగా డీఎంకేకు వ్యతిరేకంగానే పార్టీ రాజకీయాలు నడిచాయి. చరిత్ర ఇలా ఉంటే డీఎంకే మద్దతుతో అన్నాడీఎంకే ప్రభుత్వం ఏర్పాటు కావాలనే ప్రతిపాదన ముందుకు తెచ్చారు. అయితే మెజారిటీ సభ్యులు ఈ ప్రతిపాదనను తోసిపుచ్చారు.

# గుజరాత్ సంచలన విజయం



బ్యాటర్ల విధ్వంసంతో బోర్ కొడుతున్న పంతొమ్మిదో సీజన్‌లో బౌలర్లు తమ హవా చూపించారు. అహ్మదాబాద్‌లో పచ్చిక వికెట్ మీద నిప్పులు చెరిగాడు రబడ(3-28). 169 పరుగుల ఛేదనలో సన్‌రైజర్స్ హైదరాబాద్ హిట్టర్లను క్రీజులో నిలవనీయని ఈ స్పీడ్‌స్టర్ గుజరాత్ విజయంలో కీలకమయ్యాడు. హోల్డర్(3-20) ఓ చేయి వేస్తూ ఒకే ఓవర్లో క్లాసెన్(14), నితీశ్ రెడ్డి(2)లను ఔట్ చేసి సన్‌రైజర్స్ ఓటమిని ఖాయం చేశాడు. కమిన్స్(19) పోరాడినా.. అవతలి ఎండ్‌లో ఆడేవారు కరువవ్వగా అగ్రస్థానాన్ని గుజరాత్‌కు కట్టబెట్టింది హైదరాబాద్. పంతొమ్మిదో సీజన్‌లో బ్యాటర్ల ఊచకోతకు బలైతున్న బౌలర్లు చాలామంది. వరల్డ్‌క్లాస్ పేసర్లు సైతం భారీగా పరుగులు సమర్పిస్తున్న వేళ.. గుజరాత్ టైటాన్స్ స్పీడ్‌స్టర్ రబడ(3-28) నేను బ్యాటర్లను భయపెట్టగలను అని నిరూపించాడు. అహ్మదాబాద్ మైదానంలో గుజరాత్‌ను కట్టడిచేసిన సంతోషంలో ఇన్నింగ్స్ ఆరంభించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ టాపార్డర్‌ను రబడ కకావికలం చేశాడు. సిరాజ్ పేస్ ధాటికి ఓపెనర్ ట్రావిస్ హెడ్(0) ఇంప్యాక్ట్ చూపకుండానే వెనుదిరిగాడు. ఆ తర్వాత బంతి అందుకున్న రబడ.. విధ్వంసక అభిషేక్ శర్మ(6), ఇషాన్ కిషన్(11)లు ఆచితూచి ఆడి ఇన్నింగ్స్ నిర్మిస్తారనుకుంటే.. రబడ ఓవర్లో సిక్సర్ బాదిన అభిషేక్ అనూహ్యంగా తర్వాతి బంతిని వికెట్ల మీదకు ఆడుకున్నాడు. ఇషాన్ వికెట్ కీపర్ బట్లర్ చేతికి చిక్కాడు. చూస్తుండగానే మూడు వికట్లు పడిన వేళ.. స్మరన్ రవిచంద్రన్(9), హెన్రిచ్ క్లాసెన్(14)లు ఆచితూచి ఆడారు.



పవర్ ప్లే చివరి ఓవర్లో సిరాజ్ క్యాచ్ వదిలేసినా.. సద్వినియోగం చేసుకోలేక గిల్‌కు సులువైన క్యాచ్ ఇచ్చేశాడు. టాపార్డర్ విఫలమైనా క్లాసెన్, సలీల్ అరోరా(16), నితీశ్ రెడ్డి(2) జట్టును ఆదుకోవాలనుకున్నారు. కానీ, ఇంప్యాక్ట్ సబ్ ప్రసిధ్ కృష్ణ(2-23) ఓవర్లో సలీల్ వెనుదిరగగా.. హోల్డర్ 11వ ఓవర్లో క్లాసెన్, నితీశ్‌లను ఔట్ చేసి మ్యాచ్‌ను గుజరాత్ వైపు తిప్పాడు. 60 పరుగులకే ఏడు వికెట్లు పడిన వేళ.. కెప్టెన్ ప్యాట్ కమిన్స్(19), శివాంగ్ కుమార్ (4)లు కాసేపు పోరాడారు. ప్రఫుల్ హింగేను రషీద్ ఔట్ చేయగా 86కే హైదరాబద్ ఇన్నింగ్స్ ముగిసింది. 82 పరుగుల తేడాతో గెలుపొందిన గుజరాత్ టేబుల్ టాపరైంది.

### రాణించిన సుదర్శన్, సుందర్

టాస్ ఓడిన గుజరాత్ టైటాన్స్‌ను పవర్ ప్లేలో సన్‌రైజర్స్ పేసర్లు వణికించారు. ఉప్పల్ హీరో ప్రఫుల్ హింగే(2-17) రెండు వికెట్లతో బ్రేకివ్వగా గుజర్తా ఇన్నింగ్స్ నత్తనడకను తలపించింది. తొలుత హింగో ఓవర్లో శుభ్‌మన్ గిల్(5) మిడ్ వికెట్‌లో ఆడిన బంతిని క్లాసెన్ డైవింగ్ క్యాచ్ పట్టాడు. ఆపై స్కూప్ షాట్ ఆడాలనుకున్న బట్లర్(7) వికెట్ కీపర్ ఇషాన్ చేతికి చిక్కాడు. అనంతరం.. నిశాంత్ సింధు(22), ఓపెనర్ సాయి సుదర్శన్(61) కీలక భాగస్వామ్యంతో ఆదుకు నే ప్రయత్నం చేశారు. కానీ, ఈసారి కమిన్స్, క్లాసెన్ జోడీ సింధును వెనక్కి పంపింది. అంతే.. 64కే మూడు కీలక వికెట్లు పడ్డాయి. ఆ దశలో సుందర్(50) జతగా సుదర్శన్ జట్టును గట్టెక్కించే ఇన్నింగ్స్ ఆడాడు. అర్ధ శతకంతో గుజరా త్‌కు మంచి స్కోరందించాలనుకున్న సుదర్శన్‌ను షకీబ్ వెనక్కి పంపాడు. డెత్ ఓవర్లలో ధాటిగా ఆడిన సుందర్ మలింగ బౌలింగ్‌లో ఫైన్ లెగ్‌లో 4, 6 బాదాడు. చివరి ఓవర్లో షకీబ్ రన్సే ఇవ్వడంతో హైదరాబాద్‌కు లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది.




## టీ20 లీగ్‌లో టీమ్‌ను కొనుగోలు చేసిన ద్రవిడ్

టీమిండియా మాజీ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్‌లో ఓ ఫ్రాంఛైజీని కొనుగోలు చేశాడు. డబ్లిన్ ఫ్రాంచైజీ యాజమాన్య హక్కులను దక్కించుకున్నాడు. ఈ విషయాన్ని లీగ్ నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు. అంతేకాకుండా లీగ్‌లోని ఫ్రాంచైజీల యాజమాన్యులతో కలిపి ఫోటో సెషన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాహుల్ ద్రవిడ్ హాజరయ్యాడు. డబ్లిన్ గార్డియన్స్ ఓనర్ రాహుల్ ద్రవిడ్ మాట్లాడుతూ.. యూరప్‌లో క్రికెట్ అభివృద్ధి, యువ ఆటగాళ్లకు అవకాశాలు కల్పించడం వంటివి తనను ఆకర్షించాయని తెలిపాడు. భారత మాజీ ఆల్-రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ గార్డియన్స్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ జట్టు బెల్ఫాస్ట్, ఎడిన్‌బరో, గ్లాస్గో, రోటర్‌డామ్, ఆమ్‌స్టర్‌డామ్ జట్లతో పోటీపడనుంది. ఈ కార్యక్రమానికి గ్లాస్గో ఫ్రాంచైజీకి చెందిన విపుల్ అగర్వాల్, రోటర్‌డామ్ ఫ్రాంచైజీకి చెందిన జోంటీ రోడ్స్, మధుకర్ శ్రీలతో పాటు, జ్యూరా సహ వ్యవస్థాపకులు అభిషేక్ బచ్చన్, సౌరవ్ బానర్జీ, ప్రియాంక కౌల్, ధీరజ్ మల్హోత్రా తదితరులు హాజరయ్యారు. క్రికెట్ ఐర్లాండ్, క్రికెట్ స్కాట్లాండ్, రాయల్ డచ్ క్రికెట్ అసోసియేషన్‌ల భాగస్వామ్యంతో యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్ నిర్వహించబడుతుంది.

ఈ లీగ్‌లో మిచెల్ మార్ష్, టిమ్ డేవిడ్, మిచెల్ సాంట్నర్, లియామ్ లివింగ్‌స్టోన్, గ్లెన్ మాక్స్‌వెల్, ఫాఫ్ డుప్లెసిస్, హెన్రిచ్ క్లాసెన్ వంటి అంతర్జాతీయ స్టార్లు పాల్గొంటారని భావిస్తున్నారు. ప్రారంభ సీజన్ ఆగస్టు 26 నుంచి సెప్టెంబర్ 20 మధ్య జరగనుంది.

## కోహ్లీపై తప్పుడు ప్రచారం చేస్తే డబ్బులు ఆఫర్

### జర్మన్ మోడల్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ లిజ్లాజ్

జర్మన్ మోడల్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ లిజ్లాజ్ మరోసారి వార్తల్లోకెక్కింది. క్రికెటర్ విరాట్? కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ 'లైక్' కాంట్రవర్సీ ఎపిసోడ్‌లో లిజ్లాజ్ తాజాగా షాకింగ్ విషయం ఒకటి బయటపెట్టింది. విరాట్‌పై నెగిటివ్ ప్రచారం చేస్తే భారీగా డబ్బులు ఇస్తామని తనకు కొన్ని మీడియా వెబ్‌సైట్లు ఆఫర్ చేశాయని చెప్పింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న లిజ్లాజ్ ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. లిజ్లాజ్ పోస్టుకు విరాట్ అకౌంట్ నుంచి లైక్ రావడంతో ఆమె ఒక్కసారిగా పాపులర్ అయ్యింది. అయితే ఇదే సందర్భంలో కొన్ని మీడియా వెబ్‌సైట్లు విరాట్ ఇమేజ్‌ను దెబ్బతీయాలని ప్రయత్నించినట్లు లిజ్లాజ్ ఆరోపించింది. కోహ్లీపై నెగిటివ్ ప్రచారం చేయాలని పలు మీడియా సంస్థలు తనను సంప్రదించాయని, అలా చేస్తే భారీ మొత్తంలో డబ్బులు ఇస్తామని చెప్పారని పేర్కొంది. అయితే డబ్బు కోసం ఒక వ్యక్తిపై తప్పుడు ఆరోపణలు చేసే మనిషిని తాను కాదని, అందుకే అలాంటి ఆఫర్లను తిరస్కరించినట్లు లిజ్లాజ్ తెలిపింది.



'విరాట్ కోహ్లీ? గురించి తప్పుగా మాట్లాడాలని, అతడు ఏనాడు అనని మాటలు కూడా అన్నట్లుగా చెప్పాలని కొన్ని మీడియా సంస్థలు నన్ను సంప్రదించాయి. ఈ విషయంలో కొద్దిగా బలవంతం కూడా చేశాయి. అది నాకు అసౌకర్యంగా అనిపించింది. కానీ నేను ఎందుకు అలా చెబుతాను డబ్బు కోసం అతడి ఇమేజ్?ను నేనెందుకు దెబ్బతీయాలి నేను అస్సలు అలాంటి వ్యక్తిని కాదు' అని లిజ్లాజ్ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. అయితే లిజ్లాజ్ వల్లే విరాట్ ఫేమస్ అయ్యాడంటూ కొన్ని కథనాలు ప్రసారం కావడంపై లిజ్లాజ్ రీసెంట్?గా స్పందించింది. తన వల్ల విరాట్ ఫేమస్ అయ్యాడనడం 'హాస్యాస్పదం' అని చెప్పింది. ప్రపంచంలోనే ప్రముఖ అథ్లెట్లలో విరాట్ ఒకడని తెలిపింది. 'నా వల్ల విరాట్?కు ఫేమ్ వచ్చింది అనడం హాస్యాస్పదం. అతను ప్రపంచంలోని ఫేమస్ పర్సనాలిటీల్లో ఒకడు. అది నేను చెప్పడం కాదు. అందరికీ తెలుసు. అయితే నేను ఒక విషయంలో స్పష్టత ఇవ్వాలనుకుంటున్నా. ఏంటంటే, జర్మనీలో క్రికెట్ అంతగా చూడరు' 'అందుకే జర్మన్ మీడియాలో అతడు ఎక్కువగా కనిపించడు. కానీ నా పోస్టుకు లైక్ కొట్టిన కాంట్రవర్సీ వల్ల ఇక్కడి మీడియాలో అతడి పేరు వినిపించింది. అందుకే వాళ్లు అలా రాసినట్లున్నారు. అందుకే విరాట్ గురించి జర్మనీ మీడియాకు నేను వివరంగా చెప్పాను. అంతేకానీ నా వల్ల విరాట్ ఫేమస్ అయ్యాడని నేను ఎప్పుడూ చెప్పలేదు. చెప్పను కూడా' అంటూ మాట్లాడిన వీడియో ఒకటి లిజ్లాజ్ ఇన్‌స్టాలో షేర్ చేసింది. గతనెల లిజ్లాజ్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఓ పోస్టుకు విరాట్ కోహ్లీ అకౌంట్ నుంచి లైక్ వచ్చింది. అలా సింగిల్ లైక్‌తో ఆమె వరల్డ్?వైడ్ ఫేమస్ అయ్యింది. అయితే తాను ఆమె పోస్టుకు ఉద్దేశపూర్వకంగా లైక్ కొట్టలేదని, అల్గారిథమ్ వల్లే అలా జరిగి ఉండొచ్చని ఆ తర్వాత విరాట్ కోహ్లీ క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశాడు. విరాట్ లైక్ కొట్టిన పోస్టు వైరల్‌గా మారింది. దీంతో ఆమెకు ఇన్?స్టాలో ఫాలోవర్లు కూడా అమాతం పెరిగారు. ప్రస్తుతం లిజ్లాజ్‌కు ఇన్‌స్టాలో 5 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. కానీ ఈ వ్యవహారంలో విరాట్‌పై ట్రోల్స్ వచ్చాయి.

## చాలా మంది నా మసిల్స్‌పై కామెంట్లు చేశారు

### భారత మహిళల క్రికెట్ స్టార్ స్మృతి మంధానా



ఈమధ్య ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో స్మృతి మంధానా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఒకసారి తాను చేతులు స్పష్టంగా కనిపించే డ్రెస్ వేసుకున్నానని తెలిపింది. ఆ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయిన తర్వాత చాలా మంది తన మసిల్స్‌పై కామెంట్లు చేశారని చెప్పింది. అథ్లెట్‌గా ఉండే వ్యక్తికి మసిల్స్ ఉండటం సాధారణమని, అది గర్వపడాల్సిన విషయమని స్మృతి తెలిపింది. "మేము ఫిట్‌గా ఉండేందుకు జిమ్‌లో చాలా కష్టపడతాం. మహిళా క్రీడాకారిణులు ప్రతిరోజూ ట్రైనింగ్ తీసుకుంటారు. శరీరం బలంగా ఉండాలి. ఫిట్‌నెస్‌ను ప్రశంసించాలి కానీ ట్రోల్ చేయకూడదు" అని ఆమె చెప్పింది. నాకు మంచి మసిల్స్ ఉన్నాయని కూడా ట్రోల్ చేశారు. అది చాలా ఫన్నీ విషయం" అని స్మృతి నవ్వుతూ చెప్పింది. ఆమె వ్యాఖ్యలకు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున మద్దతు లభించింది. చాలా మంది అభిమానులు ఆమె ధైర్యాన్ని ప్రశంసించారు. మహిళా అథ్లెట్లను వారి ప్రతిభ కంటే రూపం ఆధారంగా ఎక్కువగా జడ్జ్ చేస్తారని కొందరు నెటిజన్లు కామెంట్లు చేశారు. పురుష క్రికెటర్ల విషయంలో ఇలాంటి ట్రోలింగ్ చాలా తక్కువగా ఉంటుందని కూడా అభిప్రాయపడ్డారు. ఇది స్మృతి మంధానాకు మొదటిసారి ఎదురైన ట్రోలింగ్ కాదు. గతంలో బెంగళూరులో జరిగిన ఒక ఈవెంట్‌లో తీసిన ఫొటోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అప్పట్లో కూడా కొందరు ఆమె రూపంపై నెగటివ్ కామెంట్లు చేశారు. అయితే అభిమానులు మాత్రం ఆమెకు బలంగా మద్దతుగా నిలిచారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఎన్నో రికార్డులు సృష్టించిన స్మృతి మంధానా ప్రస్తుతం మహిళల క్రికెట్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన ఆటగాళ్లలో ఒకరిగా కొనసాగుతోంది.



## అక్షర్ పటేల్‌కు రూ. 12 లక్షల జరిమానా

ఐపీఎల్ 2026లో ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్‌కు చేదు అనుభవం ఎదురైంది. సోమవారం పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ఢిల్లీ జట్టు అద్భుత విజయాన్ని అందుకున్నప్పటికీ, కెప్టెన్ అక్షర్ పటేల్‌పై బీసీసీఐ క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. స్లో ఓవర్ రేట్ కారణంగా అతనికి భారీ జరిమానా విధించింది. నిర్ణీత సమయంలోగా ఓవర్లు పూర్తి చేయడంలో విఫలమైనందుకు అక్షర్ పటేల్‌కు రూ. 12 లక్షల ఫైన్ పడింది. ఈ సీజన్‌లో అక్షర్ ఇలా ఫైన్ కట్టడం ఇదే మొదటిసారి. ఈ జరిమానాతో అక్షర్ పటేల్ ఇప్పుడు ఐపీఎల్ 2026లో శిక్షకు గురైన ఇతర కెప్టెన్ల క్లబ్‌లో చేరిపోయాడు. అక్షర్ కంటే ముందు శ్రేయస్ అయ్యర్, హార్దిక్ పాండ్యా, శుభ్‌మన్ గిల్, రుతురాజ్ గైక్వాడ్ వంటి స్టార్ కెప్టెన్లు కూడా ఇదే స్లో ఓవర్ రేట్ కారణంగా జరిమానాలు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఇప్పటికే రెండుసార్లు ఈ తప్పు చేసి భారీ మూల్యం చెల్లించుకున్నాడు. అక్షర్ పటేల్‌కు ఇది మొదటి తప్పు కావడంతో నిబంధనల ప్రకారం కనీస శిక్ష అయిన రూ.12 లక్షలతో సరిపెట్టారు. ఒకవైపు జరిమానా పడినా, మరోవైపు జట్టును గెలిపించిన ఆనందంలో అక్షర్ ఉన్నాడు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో ఢిల్లీకి గెలుపు అనివార్యమైన తరుణంలో అక్షర్ పటేల్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఈ సీజన్‌లో వరుసగా విఫలమవుతున్న అక్షర్, కీలక సమయంలో 56 పరుగుల అద్భుత హాఫ్ సెంచరీతో మెరిశాడు. అంతకుముందు ఆడిన మ్యాచ్‌లలో కనీసం రెండంకెల స్కోరు చేయడానికి ఇబ్బంది పడ్డ అక్షర్, ఒకేసారి 50 ప్లస్ స్కోరు సాధించి విమర్శకుల నోళ్లు మూయించాడు. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. 211 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్, మరో ఓవర్ మిగిలి ఉండగానే 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. 3 వికెట్ల తేడాతో విజయం సాధించిన ఢిల్లీ, పాయింట్ల పట్టికలో ఎగబాకి ప్లేఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. పంజాబ్ ఓటమి ఆ జట్టు ప్లేఆఫ్స్ ఆశలను దెబ్బతీయగా, ఢిల్లీ క్యాపిటల్స్ మాత్రం ఇప్పుడు రేసులోకి దూసుకొచ్చింది.



# విడాకుల జాబితాలో మరో నటి

## భర్తను అన్ ఫాలో చేసిన మౌనీరాయ్

నటి మౌనీరాయ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక వార్త కొన్ని రోజులుగా నెట్టింట వైరల్ అవుతోంది. భర్త సూరజ్ నంబియార్‌తో ఆమె విడిపోతున్నట్లు నెట్టింట ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ వార్తలకు బలం చేకూర్చేలా ఇన్‌స్టాగ్రామ్‌లో వీరిద్దరూ ఒకరికొకరు అన్‌ఫాలో చేసుకున్నారు. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే మౌనీ రాయ్ తనకు సంబంధించిన విషయాలను పంచుకుంటూ టూర్స్ ఫొటోలను షేర్ చేస్తుంటారు. కొన్ని రోజులుగా భర్తతో ఉన్న ఫొటోలు పోస్ట్ చేయలేదు. మరోవైపు సూరజ్ నంబియార్ ఇన్‌స్టాలో పెళ్లి ఫొటోలు కూడా కనిపించడం లేదు. అలాగే రూమర్స్‌ను ఇద్దరూ ఖండించకపోవడంతో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. 2022 జనవరిలో తన ప్రియుడు సూరజ్ నంబియార్‌ను మౌనీరాయ్ గోవాలో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. సినిమాల విషయానికొస్తే.. మౌనీరాయ్ 'విశ్వంభర'లో ఓ స్పెషల్ సాంగ్ చేసినట్లు సమాచారం. చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. చిరంజీవి సూపర్ హిట్ సినిమా 'ఖైదీ'లోని రగులుతోంది మొగలిపొద.. పాట రీమేక్‌కు మౌనీరాయ్‌తో కలిసి చిరు మరోసారి మెస్మరైజ్ చేయనున్నట్లు తెలుస్తోంది.



# ఎన్టీఆర్ -నీల్ ప్రాజెక్ట్ మూవీ

## మే 19న అర్ధరాత్రి గ్లింప్స్ విడుదల

జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఎన్టీఆర్-నీల్' ప్రాజెక్ట్ నుంచి అదిరిపోయే అప్డేట్ రాబోతోంది. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా కెజిఎఫ్, 'సలార్' సినిమాలతో తనకంటూ ప్రత్యేకమైన మాస్ యూనివర్స్‌ను సృష్టించిన ప్రశాంత్ నీల్, ఇప్పుడు తారక్‌ను ఎలా చూపించబోతున్నాడోననే ఆసక్తి అభిమానుల్లో రోజురోజుకీ పెరుగుతోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ గ్లింప్స్‌ను తారక్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. దీంతో మే 20న అభిమానులకు భారీ ట్రీట్ ఖాయమని అందరూ భావించారు. అయితే ఇప్పుడు తాజా సమాచారం ప్రకారం, అభిమానుల ఉత్కంఠను మరింత పెంచేలా మేకర్స్ ఒక రోజు ముందుగానే గ్లింప్స్‌ను రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట. అంటే మే 19 అర్ధరాత్రి 12 గంటలకే ఈ ఫస్ట్ గ్లింప్స్ విడుదల కానున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. అర్ధరాత్రి నుంచే సోషల్ మీడియాలో తారక్ ఫ్యాన్స్ సంబరాలు మొదలయ్యే అవకాశముంది. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన చిన్న చిన్న లీక్స్, సెట్స్ ఫోటోలు అభిమానుల్లో భారీ హైప్ తీసుకొచ్చాయి. ఇప్పుడు ఫస్ట్ గ్లింప్స్‌తో ప్రశాంత్ నీల్ సృష్టించిన కొత్త ప్రపంచం ఎలా ఉండబోతుందో చూడాలని సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# వరుస ఫ్లాపులతో ముందు జాగ్రత్త

## రెమ్యూనరేషన్ భారీగా తగ్గించుకున్న రవితేజ



మాస్ మహారాజా రవితేజ గత కొంతకాలంగా బాక్సాఫీస్ వద్ద సరైన విజయాన్ని అందుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు వరుస హిట్లతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక మార్కెట్‌ను సృష్టించుకున్న రవితేజ, ఇప్పుడు వరుస పరాజయాలతో కెరీర్‌లో వైఫల్య దశను ఎదుర్కొంటున్నారు. ఇటీవల విడుదలైన సినిమాలు ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోకపోవడంతో, ఆయన తన తదుపరి ప్రాజెక్టుల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇప్పటివరకు కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌తో ప్రేక్షకులను అలరించిన రవితేజ, ఇప్పుడు మార్కెట్ పరిస్థితులను బట్టి తన నిర్ణయాల్లో మార్పులు చేస్తున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా రెమ్యూనరేషన్ విషయంలో ఆయన తీసుకున్న తాజా నిర్ణయం చిత్రసీమలో హాట్ టాపిక్‌గా మారింది. ఒకప్పుడు సినిమా కోసం రూ.25 కోట్ల వరకు పారితోషికం తీసుకున్న రవితేజ, ప్రస్తుతం తన రెమ్యూనరేషన్‌ను రూ.15 కోట్లకు తగ్గించుకున్నారని ప్రచారం. నిర్మాతలపై అదనపు భారం పడకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. వరుస డిజాస్టర్ల తర్వాత మార్కెట్‌లో తన స్థాయిని మళ్లీ నిలబెట్టు కోవాలంటే ముందుగా మంచి విజయాన్ని అందుకోవాల్సిన అవసరం ఉందని రవితేజ భావిస్తున్నారట. అందుకే ప్రస్తుతం కథల ఎంపికలో కూడా ఆయన చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ప్రస్తుతం రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి' పై ఇండస్ట్రీలో మంచి ఆసక్తి నెలకొంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా రవితేజ కెరీర్‌లో పూర్తిగా భిన్నమైన ప్రయత్నంగా చెబుతున్నారు. ఇప్పటివరకు ఎక్కువగా మాస్, కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్స్ చేసిన రవితేజ, ఈసారి థ్రిల్లర్ జానర్‌ను ఎంచుకోవడం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. 'ఇరుముడి' సినిమా కథ, ట్రీట్‌మెంట్, రవితేజ పాత్ర పూర్తిగా కొత్తగా ఉండబోతున్నాయని సమాచారం. ఈ సినిమా విజయమే ఇప్పుడు ఆయన కెరీర్‌కు చాలా కీలకంగా మారింది. ఒకవేళ ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధిస్తే రవితేజ మళ్లీ ఫామ్‌లోకి రావడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.



# కమల్-రజనీ మూవీలో త్రిష

తమిళనాడులో ఎన్నికల సందడి మొదలు... గత కొన్ని రోజులుగా త్రిష పేరు మార్మోగిపోతోంది. ముఖ్యమంత్రిగా తమిళ సూపర్‌స్టార్ విజయ్ ప్రమాణ స్వీకారోత్సవంలోనూ త్రిష ప్రధాన ఆకర్షణగా నిలిచారు. తమిళనాడు రాజకీయాల్లోకి ఆమె కూడా ప్రవేశిస్తారన్న ప్రచారం సామాజిక మాధ్యమాల్లో మొదలైంది. అయితే ఆమె వరుస సినిమాలతో సందడి చేయబోతోంది. మరోవైపు కొత్త ప్రాజెక్టుల విషయంలోనూ ఆమె పేరు బలంగా వినిపిస్తోంది. రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి చేయనున్న సినిమాలోనూ త్రిష కథానాయికగా నటించనున్నట్టు సమాచారం. నాలుగున్నర దశాబ్దాల తర్వాత రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆ సినిమాలోనే త్రిష ఓ కథానాయికగా నటించనున్నట్టు తెలుస్తోంది. అదే నిజమైతే ఈ కలయిక మరింత ప్రత్యేకం కానుంది. దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన అనంతరం ఇన్‌స్టాలో ఓ పోస్ట్‌ని పంచుకున్నారు త్రిష. ప్రేమ ఎప్పుడూ గట్టిగానే వినిపిస్తుంది... అనే వ్యాఖ్యని జోడిస్తూ, తన ముస్తాబు వెనకున్న తన బృందానికి కృతజ్ఞతలు చెప్పింది.

# వేసవిలో వచ్చే అసిడిటీ, జీర్ణ సమస్యలను తగ్గించి శరీరాన్ని చల్లబరిచే పదార్థాలు ఇవి..!

రాత్రిపూట ఛాతిలో మంట, గొంతు వరకు వచ్చే ఆమ్లత్వం (అసిడిటీ) సమస్య చాలామందిని ఇబ్బంది పెడుతోంది. ముఖ్యంగా మసాలా ఎక్కువగా ఉన్న ఆహారం తిన్న తర్వాత లేదా ఆలస్యంగా భోజనం చేసినప్పుడు ఈ సమస్య మరింత పెరుగుతుంది. ఇలాంటి సమయంలో చాలామంది అంటాసిడ్ లపై ఆధారపడుతుంటారు. అయితే సంప్రదాయ భారతీయ ఇంటి చిట్కాలలో ఒకటైన చల్లటి పాలు -- గుల్కంద్ మిశ్రమం కూడా ఈ సమస్యకు ఉపశమనాన్ని అందిస్తుంది. ఈ చిట్కా ఇప్పుడు మళ్లీ ప్రాచుర్యం పొందుతోంది. అయితే అసలు ఈ కలయిక నిజంగా అసిడిటీని తగ్గించగలదా? దాని వెనుక ఉన్న శాస్త్రీయ కారణాలేమిటో పోషకాహార నిపుణులు వివరిస్తున్నారు.



### పాలు సహజ అంటాసిడ్..

పాలను సహజ అంటాసిడ్‌గా చాలా కాలంగా ఉపయోగిస్తున్నారు. పాలలో ఉండే కాల్షియం కార్బొనేట్ పొట్టలో అధికంగా ఉత్పత్తి అయ్యే ఆమ్లాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. చల్లని పాలను తాగడం వల్ల రెండు ప్రధాన ప్రయోజనాలు లభిస్తాయి. మొదటిది, ఇది పొట్టలోని అదనపు ఆమ్లాన్ని తాత్కాలికంగా సమతుల్యం చేస్తుంది. దీంతో ఛాతిలో మంట తగ్గుతుంది. రెండవది, చల్లని పాలు గొంతు, ఆహారనాళంలో ఏర్పడిన మంటను తగ్గిస్తాయి. ఇది ఒక రకమైన రక్షణ పొరలా పనిచేసి ఆమ్లం నేరుగా కణజాలాన్ని తాకకుండా చేస్తుంది. అయితే అసిడిటీ సమస్య ఉన్నవారు పూర్తి కొవ్వు ఉన్న పాలకు బదులుగా తక్కువ కొవ్వు (లో-ఫ్యాట్) లేదా స్కిమ్డ్ మిల్క్ తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అధిక కొవ్వు ఉన్న పాలు జీర్ణక్రియను నెమ్మదింపజేసి మరింత ఆమ్ల ఉత్పత్తికి కారణమయ్యే అవకాశం ఉంటుంది.

### శరీరాన్ని చల్లబరిచే గుల్కంద్..

ఇక గుల్కంద్ శరీరానికి సహజ చల్లదనాన్ని అందిస్తుంది. గుల్కంద్ అనేది ఎండబెట్టిన గులాబీ రేకులు, చక్కెరతో తయారుచేసే తీపి పదార్థం. ఆయుర్వేదంలో దీనిని శరీరంలోని అధిక వేడిని తగ్గించే సహజ శీతల పదార్థంగా భావిస్తారు. గులాబీ రేకుల్లో ఉండే వోలటైల్ ఆయిల్స్, టానిన్స్ స్వల్ప యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కలిగి ఉంటాయి. ఇవి శరీరంలో ఏర్పడే మంట భావాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. గుల్కంద్‌ను పాలలో కలిపి తీసుకుంటే కేవలం రుచి మాత్రమే కాకుండా శరీరానికి చల్లదనం కూడా అందుతుంది. ఇంకా గుల్కంద్ స్వల్ప సహజ విరేచన గుణాన్ని కలిగి ఉంటుంది. మలబద్ధకం లేదా మందగించిన జీర్ణక్రియ వల్ల కూడా రాత్రిపూట అసిడిటీ పెరిగే అవకాశం ఉంటుంది. గుల్కంద్ జీర్ణక్రియను మెరుగుపరచి గ్యాస్, ఆమ్లం పైకి రావడాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.

### రాత్రి సమయంలో తీసుకుంటే..

అసిడిటితో బాధపడే వారు ఈ మిశ్రమాన్ని రాత్రి సమయంలో తీసుకోవడం మంచిది. రాత్రివేళల్లో నిద్రిస్తున్నప్పుడు గురుత్వాకర్షణ ప్రభావం తగ్గిపోవడంతో పొట్టలోని ఆమ్లం సులభంగా ఆహారనాళంలోకి చేరే అవకాశం ఉంటుంది. అందుకే అసిడిటీ సమస్య రాత్రివేళల్లో ఎక్కువగా కనిపిస్తుంది. నిద్రకు సుమారు 30 నిమిషాల ముందు చల్లని పాలలో ఒక టీ స్పూన్ గుల్కంద్ కలిపి తాగితే జీర్ణాశయంలోని పీహెచ్ స్థాయిలు కొంతవరకు సమతుల్యం అవుతాయి. అలాగే గుల్కంద్‌లో ఉండే సహజ గ్లూకోజ్ శరీరానికి స్వల్ప శక్తిని అందించి రాత్రి శరీర మరమ్మత్తు ప్రక్రియలకు సహాయపడుతుంది. అయితే ఇది ప్రతి ఒక్కరికీ సరిపోదు. ఈ పానీయం కొందరికి ఉపశమనం ఇచ్చినా, అందరికీ అనుకూలం కావాల్సిన అవసరం లేదు.

### అలర్జీలు ఉంటే వద్దు..

పాలకు అలర్జీ లేదా లాక్టోస్ అసహనం ఉన్నవారిలో గ్యాస్, పొట్ట ఉబ్బరం, విరేచనాలు వంటి సమస్యలు తలెత్తే అవకాశాలు ఉంటాయి. గుల్కంద్‌లో చక్కెర అధికంగా ఉండటం వల్ల మధుమేహం ఉన్నవారు జాగ్రత్తగా తీసుకోవాలి. ఎక్కువ మోతాదులో తీసుకుంటే బరువు పెరగడం, శరీరంలో మ్యూకస్ పెరగడం వంటి సమస్యలు వస్తాయి. జలుబు, దగ్గు లేదా సైనస్ సమస్యలు ఉన్నవారిలో ఇది అసౌకర్యాన్ని పెంచే అవకాశం కూడా ఉంటుంది. రాత్రిపూట అసిడిటీతో బాధపడేవారు అర గ్లాస్ చల్లని లో-ఫ్యాట్ పాలలో ఒక టీ స్పూన్ స్వచ్ఛమైన గుల్కంద్ కలిపి నెమ్మదిగా తాగితే ఉపశమనం పొందవచ్చు. దీర్ఘకాలిక అసిడిటీ వెనుక హెచ్.పైలోరి ఇన్ఫెక్షన్ లేదా ఇతర జీర్ణ సంబంధ సమస్యలు ఉండే అవకాశం ఉంటుంది. కనుక వారానికి రెండుసార్ల కంటే ఎక్కువగా అసిడిటీ వస్తుంటే వైద్యులను సంప్రదించడం అవసరం.

## శాకాహారం మాత్రమే తింటే క్యాన్సర్లు రాకుండా అడ్డుకోవచ్చా..



శాకాహార ఆహారం ఆరోగ్యానికి మేలు చేస్తుందనే విషయం ఇప్పటికే అనేక అధ్యయనాలు సూచించాయి. తాజాగా నిర్వహించిన ఒక విస్తృత స్థాయి పరిశోధనలో శాకాహార ఆహారం కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు వెల్లడించారు. యూకే, అమెరికా, భారత్, తైవాన్ దేశాలకు చెందిన దాదాపు 18 లక్షల మంది డేటాను విశ్లేషించిన ఈ అధ్యయనం, మాంసాహారం, క్యాన్సర్ మధ్య సంబంధంపై ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద పరిశోధనల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఈ అధ్యయనంలో సాధారణ మాంసాహారులు, కోడి మాంసం మాత్రమే తినేవారు, చేపలు తినేవారు, శాకాహారులు, పూర్తిగా వేగన్ ఆహారం తీసుకునేవారిని ఐదు వర్గాలుగా విభజించి పరిశీలించారు. ఫలితాల్లో శాకాహారులు ప్యాంక్రియాటిక్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్, కిడ్నీ క్యాన్సర్, మల్టిపుల్ మైలోమా వంటి కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదాన్ని తక్కువగా ఎదుర్కొన్నట్లు గుర్తించారు. అయితే ఒక రకమైన ఈసోఫేజియల్ క్యాన్సర్ ప్రమాదం మాత్రం శాకాహారుల్లో ఎక్కువగా కనిపించిందని అధ్యయనం వెల్లడించింది.

### శాకాహారాల్లో క్యాన్సర్ ముప్పు తక్కువే..

బ్రిటిష్ జర్నల్ ఆఫ్ క్యాన్సర్ లో ప్రచురితమైన ఈ పరిశోధనను ఆక్స్‌ఫర్డ్ పాపులేషన్ హెల్త్ కు చెందిన క్యాన్సర్ ఎపిడెమియాలజీ యూనిట్ నిర్వహించింది. ప్రపంచ క్యాన్సర్ పరిశోధన నిధి సహకారంతో సాగిన ఈ అధ్యయనంలో పాల్గొన్న వారిని సగటున 16 సంవత్సరాల పాటు పరిశీలించారు. శరీర బరువు (దీవీ×) వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని ఆహారం ప్రభావాన్ని ప్రత్యేకంగా విశ్లేషించారు. అధ్యయనం ప్రకారం, శాకాహారుల్లో కొన్ని క్యాన్సర్ల ప్రమాదం 31 శాతం వరకు తగ్గినట్లు గుర్తించారు. ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ ప్రమాదం 21 శాతం, బ్రెస్ట్ క్యాన్సర్ 9 శాతం, ప్రోస్టేట్ క్యాన్సర్ 12 శాతం, కిడ్నీ క్యాన్సర్ 28 శాతం, మల్టిపుల్ మైలోమా 31 శాతం వరకు తగ్గినట్లు వెల్లడించారు. చేపలు తినేవారిలో, కోడి మాంసం మాత్రమే తీసుకునేవారిలో కూడా కొంతమేర ప్రయోజనాలు కనిపించాయి. ముఖ్యంగా కొలొరెక్టల్, ప్రోస్టేట్ క్యాన్సర్ల ప్రమాదం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు.

### శాకాహారులకు ఇదే ప్రమాదం..

నిపుణుల అభిప్రాయం ప్రకారం పండ్లు, కూరగాయలు, సంపూర్ణ ధాన్యాలు, పప్పుధాన్యాలు అధికంగా ఉండే శాకాహార ఆహారం శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ (వాపు)ను తగ్గించడంలో సహాయపడుతుంది. వీటిలో ఉండే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, తక్కువ శాచురేటెడ్ ఫ్యాట్స్ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెబుతున్నారు. ముఖ్యంగా ఎర్ర మాంసం, ప్రాసెస్డ్ మాంసం తగ్గించడం వల్ల ట్యూమర్ల పెరుగుదలకు కారణమయ్యే కొన్ని రసాయనాల ప్రభావం తగ్గుతుందని పరిశోధకులు భావిస్తున్నారు. అయితే శాకాహారం తీసుకునేవారిలో ఒక రకమైన ఈసోఫేజియల్ క్యాన్సర్ ప్రమాదం పెరగడం ఆందోళన కలిగించే అంశంగా అధ్యయనం పేర్కొంది. విటమిన్ బి12 వంటి కొన్ని పోషకాల లోపం దీనికి కారణం కావచ్చని శాస్త్రవేత్తలు అనుమానిస్తున్నారు. పూర్తిగా వేగన్ ఆహారం తీసుకునేవారిలో కాల్షియం తక్కువగా ఉండటం వల్ల కొలొరెక్టల్ క్యాన్సర్ ప్రమాదం పెరిగే అవకాశం ఉందని కూడా సూచించారు.

### సమతుల్య ఆహారం ముఖ్యం..

భారత్‌లో 20 నుంచి 40 శాతం మంది వరకు శాకాహారం తీసుకునే నేపథ్యంలో ఈ అధ్యయనం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. పట్టణీకరణతోపాటు బ్రెస్ట్, ప్రోస్టేట్, కొలొరెక్టల్ క్యాన్సర్ల కేసులు పెరుగుతున్న సమయంలో, సంప్రదాయ భారతీయ శాకాహార ఆహారం క్యాన్సర్ నివారణలో సహాయపడవచ్చని నిపుణులు చెబుతున్నారు. అయితే కేవలం కార్బోహైడ్రేట్లు, వేయించిన పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల ఊబకాయం, మధుమేహం వంటి సమస్యలు పెరిగి క్యాన్సర్ ప్రమాదం అధికమయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. అందువల్ల సమతుల్య ఆహారం తీసుకోవడం, ఫైబర్ అధికంగా ఉన్న కూరగాయలు ఎక్కువగా తినడం, అవసరమైతే విటమిన్ బి12 స్థాయిలను పరీక్షించుకోవడం అవసరమని సూచిస్తున్నారు.

## వేసవిలో కాఫీ ప్రియులకు ఉపశమనం అందించే కోల్డ్ కాఫీ వెరైటీలు

ఎండాకాలంలో వేడి తట్టుకోవడం కష్టంగా మారినప్పుడు, చాలామందికి చల్లటి పానీయాలపై ఆసక్తి పెరుగుతుంది. అయితే కాఫీ ప్రియులకు మాత్రం వేడిలో కూడా కాఫీ తాగాలనే కోరిక తగ్గదు. ఇలాంటి సమయంలో కోల్డ్ కాఫీ మంచి ఎంపికగా మారుతుంది. ఒకప్పుడు కేఫేల్లో మాత్రమే దొరికే కోల్డ్ కాఫీ ఇప్పుడు ఇంట్లోనే సులభంగా తయారు చేసుకునే స్థాయికి చేరుకుంది. సాధారణ ఐస్ కాఫీ నుంచి ప్రత్యేకమైన కోల్డ్ బ్రూ, ఎస్ప్రెస్సో టానిక్ వంటి ఎన్నో రకాల చల్లని కాఫీ వేరియంట్లు ప్రస్తుతం ప్రాచుర్యం పొందుతున్నాయి.



### క్లాసిక్ ఐస్ కాఫీ, కోల్డ్ బ్రూ..

క్లాసిక్ ఐస్ కాఫీ (Classic Iced Coffee) అత్యంత సులభంగా తయారుచేసుకునే కోల్డ్ కాఫీ. చాలామంది వేడి కాఫీని నేరుగా ఐస్‌పై పోస్తారు. కానీ అలా చేస్తే కాఫీ రుచి పలుచబడిపోతుంది. అందుకే ముందుగా కాఫీని చల్లార్చి, తర్వాత ఐస్ క్యూబ్స్‌పై పోసి పాలతో కలిపితే మంచి రుచి వస్తుంది. కాఫీ ఐస్ క్యూబ్స్ తయారు చేసి వాటినే ఉపయోగిస్తే కాఫీ మరింత రుచిగా ఉంటుంది. కోల్డ్ బ్రూ (Cold Brew) ప్రస్తుతం యువతలో విపరీతంగా ప్రాచుర్యం పొందుతోంది. ఇందులో కాఫీ పొడిని 12 నుంచి 24 గంటల పాటు చల్లని నీటిలో నానబెట్టి తయారు చేస్తారు. దీని వల్ల సాధారణ కాఫీతో పోలిస్తే మృదువైన రుచి, తక్కువ ఆమ్లత్వం లభిస్తుంది. తయారుచేసిన కోల్డ్ బ్రూను ఫ్రిజ్‌లో రెండు వారాల వరకు నిల్వ చేసుకోవచ్చు. మోకా ఫ్రాపే (Mocha Frappe) చాక్లెట్ రుచి ఇష్టపడేవారికి మంచి ఎంపిక. కాఫీ, కోకో పౌడర్, పాలు, ఐస్ కలిపి బ్లెండ్ చేస్తే చిక్కగా, క్రీమీగా ఉండే ఈ డ్రింక్ సిద్ధమవుతుంది. పైగా విప్డ్ క్రీమ్ లేదా చాక్లెట్ షేవింగ్స్ జోడిస్తే కేఫే స్టైల్ రుచి ఇంట్లోనే ఆస్వాదించవచ్చు. కొబ్బరి పాలు ఉపయోగిస్తే మరింత రిచ్ ఫ్లేవర్ వస్తుంది.

### కోల్డ్ బ్రూ ఆరెంజ్ కాఫీ..

కోల్డ్ బ్రూ ఆరెంజ్ కాఫీ (Cold Brew with Orange) వినడానికి కొంచెం కొత్తగా అనిపించినా, కాఫీ, నారింజ కలయిక ప్రత్యేకమైన రుచిని ఇస్తుంది. కోల్డ్ బ్రూ కాఫీలో తాజా నారింజరసం, తేనె కలిపితే తీపి, చేదు, సిట్రస్ రుచులు కలిసిన ప్రత్యేకమైన డ్రింక్ సిద్ధమవుతుంది. ప్యాకెట్ జ్యూస్ కంటే తాజా జ్యూస్ వాడితే రుచి ఇంకా బాగుంటుంది. ఎస్ప్రెస్సో టానిక్ (Espresso Tonic) కూడా ప్రస్తుతం కాఫీ ప్రియులను ఆకట్టుకుంటున్న మరో ప్రత్యేక డ్రింక్. టానిక్ వాటర్‌లో ఐస్ వేసి, పైగా ఎస్ప్రెస్సో పోస్తే పొరలుగా కనిపించే ఈ డ్రింక్ చూడటానికే ఆకర్షణీయంగా ఉంటుంది. టానిక్ వాటర్‌లోని స్వల్ప చేదు రుచి, కాఫీ ఫ్లేవర్‌తో కలిసిపోవడం వల్ల కొత్త అనుభూతిని ఇస్తుంది.

### ఐస్డ్ ఆల్మండ్..

డెయిరీ పాలు తాగకుండా ఉండేవారికి ఐస్డ్ ఆల్మండ్ లేదా ఓట్ మిల్క్ లాటే (Iced Almond or Oat Milk Latte) మంచి ప్రత్యామ్నాయం. ఆల్మండ్ మిల్క్‌లో సహజమైన తీపి, నట్ ఫ్లేవర్ ఉండటం వల్ల కాఫీ రుచి మరింత బాగుంటుంది. ఓట్ మిల్క్ ఉపయోగిస్తే క్రీమీ టెక్స్చర్ లభిస్తుంది. చివరగా కొద్దిగా దాల్చిన చెక్క లేదా యాలకుల పొడి చల్లితే భారతీయ రుచితో కూడిన ప్రత్యేకమైన కాఫీ సిద్ధమవుతుంది. ఇలా వేసవిలో ఇంట్లోనే సులభంగా వివిధ రకాల కోల్డ్ కాఫీలను తయారు చేసుకోవచ్చు. కొద్దిపాటి పదార్థాలతో కేఫే స్టైల్ రుచిని ఆస్వాదించడంతోపాటు, బయట ఖర్చు కూడా తగ్గించుకోవచ్చు.

## జీఎల్‌పీ-1 మందులు అందరికీ ఒకే విధంగా ఎందుకు పనిచేయవు

బరువు తగ్గేందుకు ఉపయోగించే ఒజెంపిక్, మొంజారో వంటి మందులు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన ఆదరణ పొందుతున్నాయి. టైప్-2 డయాబెటిస్ చికిత్స కోసం రూపొందించిన ఈ ఔషధాలను చాలామంది బరువు తగ్గడానికి కూడా ఉపయోగిస్తున్నారు. అయితే అందరికీ ఇవి ఒకే విధంగా పనిచేయవు. కొందరు ఈ మందులతో శరీర బరువులో 20 శాతం వరకు తగ్గుదల చూస్తుంటే, మరికొందరికి మాత్రం తక్కువ ఫలితాలే కనిపిస్తున్నాయి. ఈ తేడాకు కారణం జన్యువులే కావచ్చని తాజా అధ్యయనం వెల్లడించింది. తాజాగా నిర్వహించిన పరిశోధనలో, ఈ మందులకు శరీరం ఎలా స్పందిస్తుందో వ్యక్తుల జన్యువులు ప్రభావితం చేస్తున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. దాదాపు 28 వేల మంది రోగుల డీఎన్‌ఏ నమూనాలను పరిశీలించిన పరిశోధకులు, కొన్ని ప్రత్యేక జన్యు మార్పులు ఉన్నవారిలో బరువు తగ్గడం ఎక్కువగా జరిగిందని గుర్తించారు. మరికొంతమందిలో మాత్రం వికారం, వాంతులు వంటి దుష్ప్రభావాలు ఎక్కువగా కనిపించాయని వెల్లడించారు. ఈ అధ్యయనం నేచర్ జర్నల్‌లో ప్రచురితమైంది.



### ప్రతి వ్యక్తికి మారే ఫలితాలు..

ఒజెంపిక్, వెగోవీ మందుల్లో సెమాగ్లూటైడ్ (హవఝ్రస్త్రశ్రీబ్‌ఱనవ) అనే సమ్మేళనం ఉంటుంది. ఇది శరీరంలో భోజనం చేసిన తర్వాత విడుదలయ్యే జీఎల్‌పీ-1 హార్మోన్‌లా పనిచేస్తుంది. ఈ హార్మోన్ మెదడుకు కడుపు నిండిన సంకేతాన్ని పంపుతుంది. ఫలితంగా ఆకలి తగ్గి, తక్కువ ఆహారం తీసుకోవడం ద్వారా బరువు తగ్గడం సాధ్యమవుతుంది. సాధారణంగా ఈ మందులతో 10 శాతం వరకు బరువు తగ్గవచ్చని చెబుతున్నప్పటికీ, ఫలితాలు వ్యక్తి వ్యక్తికీ భిన్నంగా ఉంటున్నాయి. పరిశోధకులు నిర్వహించిన జీనోమ్-వైడ్ అసోసియేషన్ స్టడీ (+ఔూా)లో జీఎల్‌పీ1ఆర్ అూనే జన్యువులో ఉన్న ఒక ప్రత్యేక మార్పు ఉన్నవారిలో బరువు తగ్గుదల మరింత ఎక్కువగా కనిపించిందని గుర్తించారు. ఈ జన్యు మార్పు ఉన్నవారిలో మందులు శరీరంపై బలంగా పనిచేసి ఆకలిని ఎక్కువగా తగ్గిస్తున్నాయని తెలిపారు. మరోవైపు, కొందరిలో మందులు సరిగా పనిచేయకపోవడానికి కారణం జన్యువుల వల్ల రిసెప్టర్లు మందులను తక్కువగా స్వీకరించడమేనని వివరించారు.

### డీఎన్‌ఏ కారణం..

అలాగే జీఐపీఆర్ సంబంధిత జన్యువుల్లో మార్పులు ఉన్నవారిలో మొంజారో వాడినప్పుడు వికారం, వాంతులు వంటి సమస్యలు ఎక్కువగా కనిపించినట్లు అధ్యయనం తెలిపింది. అయితే ఈ జన్యు మార్పులు బరువు తగ్గుదలపై మాత్రం ప్రభావం చూపలేదని పరిశోధకులు పేర్కొన్నారు. నిపుణుల ప్రకారం, మన డీఎన్‌ఏ ఆకలి, కొవ్వు నిల్వలు, మెటబాలిజం వంటి అనేక అంశాలను ప్రభావితం చేస్తుంది. అందువల్లే కొందరు మందులకు త్వరగా స్పందిస్తే, మరికొందరిలో ప్రభావం తక్కువగా కనిపిస్తుంది. అయితే ఆహారపు అలవాట్లు, వ్యాయామం, జీవనశైలి కూడా కీలక పాత్ర పోషిస్తాయని వారు గుర్తుచేస్తున్నారు. జన్యువులు కేవలం 5 నుంచి 10 శాతం వరకు మాత్రమే ప్రభావం చూపుతాయని అంచనా వేస్తున్నారు. ఈ పరిశోధన భవిష్యత్తులో వ్యక్తిగత జన్యువుల ఆధారంగా బరువు తగ్గించే చికిత్సలు అందించే అవకాశాలకు మార్గం చూపుతోంది. భవిష్యత్తులో సాధారణ జన్యు పరీక్షల ద్వారా ఏ మందు ఎవరికి బాగా పనిచేస్తుందో ముందుగానే తెలుసుకునే అవకాశం ఉండవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. దీని వల్ల సరైన మందును ఎంపిక చేయడం, దుష్ప్రభావాలను తగ్గించడం, చికిత్స ఫలితాలను మెరుగుపరచడం సులభమవుతుందని చెబుతున్నారు.

# హిందూ ఏక్తా యాత్రలో బండి సంజయ్ ఉద్వేగ ప్రసంగం

## అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఘనంగా పెద్ద హనుమాన్ జయంతి వేడుకలు



కరీంనగర్: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ బాలుర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రాంగణంలోని హనుమాన్ ఆలయంలో పెద్ద హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆంజనేయస్వామిని భక్తితో ఆరాధించిన వారికి సకల శుభాలు కలుగుతాయని, జీవితంలోని ఆటంకాలు తొలగిపోతాయని అన్నారు. శ్రీరాముడి ఆదేశాలను నిబద్ధతతో అమలు చేసిన ఆంజనేయుడు గురుభక్తి, ధైర్యం, సేవాభావానికి ప్రతీక అని పేర్కొన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా భక్తులు ఉపవాసాలు పాటిస్తూ హనుమాన్ చాలీసా పారాయణం చేస్తారని తెలిపారు. వైశాఖ శుద్ధ దశమి రోజున హనుమాన్ జయంతి జరుపుకోవడం ప్రత్యేకతగా భావిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించగా, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ వేడుకలు బ్రహ్మశ్రీ డా. గర్రెపల్లి మహేశ్వర శర్మ మార్గదర్శకత్వంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## ఐఐఐటీ హైదరాబాద్ యూజీఈఈలో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ




కరీంనగర్, మే 12: ఐఐఐటీ హైదరాబాద్ నిర్వహించిన అండర్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (UGEE)-2026లో అల్ఫోర్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అల్ఫోర్స్‌కు చెందిన పూట్కూరి శ్రేయాన్ రెడ్డి, గుజ్జుల అశీష్ రెడ్డి, గంగడి చైత్ర ఇంటర్వ్యూకు ఎంపికయ్యారని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతర కృషి, పట్టుదలతో పోటీ పరీక్షల్లో విజయాలు సాధించవచ్చని విద్యార్థులు నిరూపించారని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలో కూడా ప్రతిభ కనబర్చి ఐఐఐటీ హైదరాబాద్‌లో సీట్లు సాధిస్తారనే నమ్మకం వ్యక్తం చేశారు. విజయం సాధించిన విద్యార్థులను డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అభినందించారు.

## ధాన్యం కొనుగోళ్ల లక్ష్యాన్ని పూర్తి చేయాలి

### సమస్యాత్మక కేంద్రాలకు ప్రత్యేక పర్యవేక్షణ బృందాలు

కరీంనగర్: అధికారుల సమన్వయంతో ధాన్యం కొనుగోళ్ల లక్ష్యాన్ని పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా ప్రతి కొనుగోలు కేంద్రంలో నూరుశాతం టార్పాలిన్ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అధిక మొత్తంలో ధాన్యం సేకరణ జరిగే కేంద్రాల సమీపంలో తాత్కాలిక నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోళ్లను కూడా వేగవంతం చేయాలని మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించిన కలెక్టర్, జిల్లాలోని ఏడు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు వేగంగా నిర్వహించాలని తెలిపారు. అవసరమైతే అదనపు గోదాములు, నిల్వ కేంద్రాలను గుర్తించాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు అధికంగా ఉన్న కేంద్రాలకు ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను నియమించాలని ఆదేశించారు. ఈ బృందాల్లో పౌరసరఫరాల, రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖల అధికారులతో పాటు ప్రత్యేక అధికారిని నియమించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ కొనుగోలు కేంద్రాలను సందర్శించి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఆర్డీవో రమేష్‌బాబు, పౌరసరఫరాల అధికారి నర్సింగారావు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## హిందూ ఏక్తా యాత్రకు పటిష్ట బందోబస్తు

### 400 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు : సీపీ గౌష్ ఆలం



కరీంనగర్, మే 12: హనుమాన్ జయంతి సందర్భంగా కరీంనగర్ నగరంలో నిర్వహించనున్న హిందూ ఏక్తా యాత్ర ర్యాలీకి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. ర్యాలీ సందర్భంగా విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులతో కమిషనర్ ప్రత్యేకంగా బ్రీఫింగ్ నిర్వహించారు. సుమారు 400 మంది పోలీసు అధికారులు భద్రతా విధుల్లో పాల్గొంటున్నట్లు వెల్లడించారు. సున్నిత ప్రాంతాల్లో స్టాటిక్ ఫోర్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, రూఫ్‌టాప్ నిఘా బృందాలు, మొబైల్ పెట్రోలింగ్ పార్టీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ర్యాలీ మార్గంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన చోట్ల ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. హిందూ ఏక్తా యాత్ర శోభాయాత్ర ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు పోలీసు శాఖ తరపున అన్ని భద్రతా చర్యలు తీసుకున్నట్లు సీపీ గౌష్ ఆలం స్పష్టం చేశారు.

### కరీంనగర్ కాషాయమయం.. వేలాదిగా తరలివచ్చిన హిందుత్వ శ్రేణులు



కరీంనగర్, మే 12: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహించిన హిందూ ఏక్తా యాత్రకు అపూర్వ స్పందన లభించింది. వేలాది మంది హిందుత్వ శ్రేణులు, మహిళలు, యువకులు, వివిధ హిందూ సంఘాల ప్రతినిధులు యాత్రలో పాల్గొనడంతో నగరంలోని ప్రధాన వీధులు కాషాయమయంగా మారాయి. వైశ్యాభవన్ నుంచి ప్రారంభమైన యాత్రలో హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేరళ డప్పు వాయిద్యాలు, హనుమంతుడు, శ్రీరాముడి రూపకాలు, సాంస్కృతిక ప్రదర్శనలు యాత్రకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాజీవ్ చౌక్, టవర్ సర్కిల్, గంజ్, కమాన్, వన్‌టౌన్, అమరవీరుల స్థూపం మార్గంగా యాత్ర కొనసాగింది. యాత్ర ప్రారంభానికి ముందు బండి సంజయ్ ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. "నా కొడుకు ఏ తప్పు చేయలేదని చెబుతున్నాడు. నిజానిజాలు కోర్టులు తేలుస్తాయి. తప్పు జరిగితే శిక్ష అనుభవించాల్సిందే. చట్టం ముందు అందరూ సమానమే. కోర్టు తీర్పు నాకు శిరోధార్యం" అని అన్నారు. "సమాజమే నా కుటుంబమని భావించి జీవితమంతా ప్రజల కోసమే కష్టపడ్డా. ప్రతి ఇంటి సమస్యను నా సమస్యగా భావించా. కానీ నా కుటుంబానికి సమయం ఇవ్వలేకపోయా. జరుగుతున్న పరిణామాలకు బాధగా ఉంది" అని పేర్కొన్నారు. తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు జరుగుతున్నాయని ఆరోపించిన బండి సంజయ్, "నా కుటుంబానికి నిప్పంటించారు. ఆ నిప్పుతోనే అవినీతి, కుట్రల సామ్రాజ్యాన్ని దహనం చేస్తా. అవినీతి గడీలను కూల్చివేస్తా" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "బండి సంజయ్ భయపడే వ్యక్తి కాదు. కష్టాలు, కేసులు, జైలు జీవితం అన్నీ చూశా. అయినా ధర్మం కోసం పోరాటం ఆపలేదు. చివరి శ్వాస వరకు హిందూ ధర్మ పరిరక్షణ కోసం పనిచేస్తా" అని స్పష్టం చేశారు. హిందూ సమాజ ఐక్యత కోసం 16 ఏళ్లుగా హిందూ ఏక్తా యాత్ర నిర్వహిస్తున్నామని, జై శ్రీరాం నినాదమే హిందూ సమాజాన్ని ఏకం చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి మాట్లాడుతూ బండి సంజయ్ హిందూ ధర్మ పరిరక్షణ కోసం కృషి చేస్తున్నారని, ఆయనకు హిందువులంతా అండగా నిలవాలని పిలుపునిచ్చారు.



## ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : సీఎం రేవంత్ రెడ్డి

### ప్రైవేట్ గోదాములను అవసరమైతే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలి




కరీంనగర్, మే 12: ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను హెచ్చరించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్ల ప్రక్రియను మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలని ఆదేశించారు. మంగళవారం ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లపై సీఎం రేవంత్ రెడ్డి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, దనసరి అనసూయ (సీతక్క), అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కరీంనగర్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రైవేట్ గోదాములను అవసరమైతే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. కమ్యూనిటీ హాళు ,, రైతు బజార్లను తాత్కాలిక నిల్వ కేంద్రాలుగా వినియోగించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన పూర్తి చేసి రైతులకు వెంటనే రశీదులు ఇవ్వాలని స్పష్టం చేశారు. రైస్ మిల్లుల వద్ద కోతలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక హమాలీలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ఎక్కడా కొరత రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రవాణా కోసం ఖాళీగా ఉన్న ట్రాక్టర్లు, డీసీఎంలు సహా అన్ని వాహనాలను వినియోగించాలని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని, తడిసిన ధాన్యం కొనుగోళ్లకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి మీడియాలో వచ్చే ప్రతికూల వార్తలపై జిల్లా కలెక్టర్లు వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. కొనుగోళ్ల అంశాన్ని తేలికగా తీసుకునే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ యాసంగి సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఇప్పటివరకు 25.78 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. రైతులకు రూ.3,873 కోట్లను చెల్లించినట్లు వెల్లడించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతం చేయాలని, ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం, మొక్కజొన్న అక్రమ రవాణాను అడ్డుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగిందని, కొనుగోళ్ల కోసం రూ.4,178 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. హమాలీ చార్జీలను ఒక్కో సంచికి రూ.8.50కు పెంచినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో రమేష్‌బాబు, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగారావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రజనీకాంత్, డీఆర్డీఓ శ్రీధర్, డీసీఓ రామానుజాచారి, జిల్లా మార్కెటింగ్ అధికారి షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## నాయీబ్రాహ్మణ విద్యార్థి హాస్టల్ అభివృద్ధిపై ట్రస్ట్ కమిటీ సమావేశం

### నూతన ఎన్నికల కమిటీ ఏర్పాటు



కరీంనగర్, మే 13: నాయీబ్రాహ్మణ విద్యార్థి హాస్టల్ వసతి గృహం ట్రస్ట్ కమిటీ సమావేశం బుధవారం తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు జంపాల నర్సయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర నాయకులు రాచకొండ విఠలేశ్వర్, తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హాజరయ్యారు. సమావేశంలో విద్యార్థి హాస్టల్ వసతి గృహ అభివృద్ధికి భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. అదేవిధంగా ట్రస్ట్ కమిటీ ఎన్నికల నిర్వహణ కోసం ఆరుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి కన్వీనర్‌గా రాచకొండ ప్రభాకర్‌ను ఎంపిక చేయగా, సభ్యులుగా అవుదుర్తి విజయ్ కుమార్, గడ్డం హరికిషన్, శ్రీరాముల బాలసురేందర్, అందుర్తి గంగాధర్, శ్రీరాముల రమేష్‌లను నియమించారు. ఈ కమిటీ నెల రోజుల్లో నూతన ట్రస్ట్ కమిటీ ఎన్నికలు నిర్వహించడంతో పాటు, భవిష్యత్తులో నాయీబ్రాహ్మణ విద్యార్థి హాస్టల్ వసతి గృహ అభివృద్ధికి కృషి చేస్తుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు, ట్రస్ట్ కమిటీ సభ్యులు మందపల్లి అంజయ్య, గర్శకుర్తి రాజశేఖర్, శ్రీరాముల రమేష్, కొత్వాల అశోక్, శ్రీరాముల శ్రీకాంత్, ముత్యాల లక్ష్మణ్, గర్శకుర్తి రవీందర్, సమ్మెట లక్ష్మణ్, కంది రవి, కొత్వాల అంజనేయులు, గర్శకుర్తి విద్యాసాగర్, ప్రసాద్, తిరుపతయ్య పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com